







- మసులా బీచ్ ఫెస్టివల్ మూడో రోజూ అదే ఉత్సాహం
- పారాగ్లైడింగ్, స్పీడ్ బోటింగ్, హెలీరైడ్‌కు క్యూ కట్టిన పర్యాటకులు
- అలరించిన కెనోయింగ్, కయాకింగ్ క్రీడలు
- హోరాహోరీగా బీచ్ వాలీబాల్, బీచ్ కబడ్డీ, బీచ్ ఫుట్‌బాల్ పోటీలు
- ఆకాశాన్నంటిన సాంస్కృతిక సంబరాలు

పర్యాటకులకు పండగే

6

మంగినపూడి సముద్రతీరంలో జనకెరటం

మచిలీపట్నంలోని మంగినపూడి తీరం శనివారం జనసంద్రమైంది. మసులా బీచ్ ఫెస్టివల్ మూడో రోజూ అదే ఉత్సాహంతో సాగింది. పారాగ్లైడింగ్, స్పీడ్ బోటింగ్, హెలీరైడ్ అనుభూతి కోసం పర్యాటకులు క్యూ కట్టారు. మళ్లీ దొరికేనా ఇటువంటి అవకాశం అంటూ కేరింతలు కొడుతూ మైమరచిపోయారు. మంత్రి కొల్లు రవీంద్ర పారాగ్లైడింగ్ చేసి యువతను ఉత్సాహపరిచారు. ఎగసి పడుతున్న అలలపై కెనోయింగ్, కయాకింగ్ పోటీలు అలరించాయి. బీచ్ వాలీబాల్, బీచ్ కబడ్డీ, బీచ్ ఫుట్‌బాల్‌లో క్రీడాకారులు గెలుపే లక్ష్యంగా తలపడ్డారు. జబర్దస్త్ హాస్య బృందం కడుపుబ్బా నవ్వించింది. సినీ సంగీత దర్శకుడు సాయి కార్తీక్, సినీ గాయని శృతి గాయత్రి సినిమా గీతాలు ఆలపించి యువతను ఉర్రూతలూగించారు. - మచిలీపట్నం/అవనిగడ్డ, ఆంధ్రజ్యోతి

ఇష్టారాజ్యం!

జెడ్పీ ఉద్యోగుల బదిలీల్లో నిర్వాకం

అయిన వారికి పదోన్నతులు, కోరుకున్న స్థానాలు!

6

జిల్లా పరిషత్‌లో ఉద్యోగుల బదిలీల వ్యవహారం అనేక విమర్శలకు దారితీస్తోంది. పలువురు ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వడం, వారు కోరుకున్న స్థానం కేటాయించడం కోసం నిబంధనలకు నీళ్లు వదిలారని ఉద్యోగులు మండిపడుతున్నారు. ఖాళీలు ఉన్నట్టు నోటీసు బోర్డులో చూపి ఇప్పుడు లేవంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖల నేపథ్యంలో బదిలీ కోసం దరఖాస్తు చేసుకోకపోయిన సీట్లు కదిలిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అవసరం లేకపోయినా పిలిచి మరీ బదిలీ దరఖాస్తులు పెట్టిస్తున్నారని వాపోతున్నారు. రెండు రోజుల్లో జరిగే బదిలీల్లో తాము ఎక్కడికి వెళ్లాల్సి వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు.

- కానివారికి బలవంతపు బదిలీలు!
- నిబంధనలకు నీళ్లు వదిలారని ఉద్యోగుల మండిపాటు



జెడ్పీ కార్యాలయం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: జెడ్పీ ఉద్యోగుల బదిలీలను పారదర్శకంగా, కౌన్సెలింగ్ పద్ధతిలో చేయాలని ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది, నిబంధనలకు వ్యతిరేకంగా బదిలీలు చేస్తే సంబంధిత జెడ్పీ సీఈవోనే బాధ్యత వహించాల్సి ఉంటుందని కూడా ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే వివిధ కారణాలతో ఈ నెల 2వ తేదీన జరగాల్సిన బదిలీల ప్రక్రియ 9వ తేదీకి వాయిదా పడింది. ఇదే అదనుగా భావించిన కొందరు తెరవెనుక చక్రం తిప్పి జెడ్పీలో ఉద్యోగులకు పదోన్నతుల అంశాన్ని తెరపైకి తెచ్చారు. తమకు అనుకూలమైన ఉద్యోగులు జెడ్పీలో పనిచేసేలా వ్యూహం అమలు చేసి పదోన్నతులు ఇచ్చేశారు. పదోన్నతి పొందిన ఉద్యోగులకు వారు కోరుకున్న ప్రాంతాల్లో పోస్టింగ్‌లు ఇచ్చారు. ఈ ప్రక్రియ నిబంధనలకు వ్యతిరేకమని, సీనియర్ ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందని, కలెక్టర్‌ను కలిసి ఉద్యోగులు విన్నవించారు. అయినా బదిలీల ప్రక్రియ అమలులో ఉన్న సమయంలో కొందరు ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వడంలో జెడ్పీ అధికారులు తమ పంతం నెగ్గించుకున్నారని ఉద్యోగులు వాపోతున్నారు. ఈ విషయంపై ఉద్యోగులు అభ్యంతరం చెప్పినా ఎవ్వరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పిలిపించి మరీ బదిలీకి దరఖాస్తు

జిల్లాలో వివిధ నియోజకవర్గాల్లో పరిపాలనా సౌలభ్యం కోసం తమకు అనుకూలమైన ఉద్యోగులను, తాము సూచించిన మండలానికి బదిలీ చేయాలని శాసన సభ్యులు, మంత్రులు, ఎంపీలు కొందరు ఉద్యోగులకు సిఫార్సు లేఖలు ఇచ్చారు. ప్రజాప్రతినిధుల మిగతా 6లో..

ఖాళీలు ఉన్నట్టు చూపినట్టేచూపి..

బదిలీల ప్రక్రియ ప్రారంభమైన సమయంలో ఐదేళ్ల పాటు ఒకే చోట పనిచేస్తున్న ఉద్యోగులు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉండటంతో వారంతా బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న ఉద్యోగుల జాబితాలతో పాటు, ఖాళీగా ఉన్న ప్రాంతాలను సూచిస్తూ నోటీసు బోర్డులో వివరాలు పెట్టారు. ఇంత వరకు బాగానే ఉంది. ఆ తర్వాత ఒక్కసారిగా వ్యవహారం మారిపోయింది. నిబంధనలను పక్కనపెట్టి నోటీసు బోర్డులో చూపిన కొన్ని ఖాళీల్లో పలువురు ఉద్యోగులకు పదోన్నతులు ఇచ్చి నియమించారని జెడ్పీ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. అనంతరం ఖాళీలను చూపే నోటీసును తొలగించారని, దీంతో తప్పనిసరిగా బదిలీ అయ్యే సీనియర్ ఉద్యోగులు దూరప్రాంతానికి బదిలీ కావాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.

పాఠశాలలకు సన్నబియ్యం

మధ్యాహ్న భోజనం పథకం నిమిత్తమే..

- డీలర్లతో సంబంధం లేకుండా నేరుగా స్కూళ్లకు..
- ప్రత్యేక బ్యాగులో క్యూఆర్, బార్ కోడ్‌తో బస్తాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మధ్యాహ్న భోజనం పథకం కోసం నాణ్యమైన సన్నబియ్యం అందుబాటులోకి వచ్చింది. ఉమ్మడి కృష్ణాజిల్లాలోని పాఠశాలలకు పంపిణీ చేసేందుకు ఈ సన్నబియ్యం బస్తాలు ఎంఎల్‌ఎస్ పాయింట్లకు చేరుకున్నాయి. ఈ బియ్యం బ్యాగులకు ఒక ప్లాస్టిక్ ట్యాగ్ కూడా ఉంది. ఈ ట్యాగ్ పైవరసలో క్యూఆర్ కోడ్ ఉంటుంది. కింది వరసలో బార్ కోడ్ ఉంది. గతంలో డీలర్లకు ఇవి నేరుగా పంపిణీ అయ్యేవి. డీలర్ల దగ్గర నుంచి పాఠశాలలకు వెళ్లేవి. ప్రస్తుతం డీలర్ల దగ్గరకు వెళ్లే పరిస్థితి లేకుండా ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి నేరుగా స్కూళ్లకు దిగుమతి అవుతాయి. పాఠశాలలకు వెళ్లాక బార్ కోడ్ వివరాలను నోట్ చేసుకుంటారు. ప్రధానోపాధ్యాయుడు బయోమెట్రిక్ వేస్తేనే బియ్యం దిగుమతి చేసినట్టు నిర్ధారణ అవుతుంది. సన్నబియ్యం పక్కదారి పట్టకుండా ఉండేందుకు వీలుగా ప్యాకింగ్, ట్యాగింగ్, బార్‌కోడింగ్, క్యూఆర్ కోడ్, బయోమెట్రిక్ వంటి విధానాలను ప్రభుత్వం తీసుకొచ్చింది. గొల్లపూడి మార్కెట్ యార్డులోని ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో దిగుమతి అయిన మధ్యాహ్న భోజన పథకం బ్యాగులను జాయింట్ కలెక్టర్ ఇలక్కియా పరిశీలించారు.


బక్రీద్‌ను పురస్కరించుకుని మచిలీపట్నంలోని ఈద్గా వద్ద శనివారం జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని ముస్లిం పెద్దలకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

ఇంటర్ సప్లిమెంటరీలో సగం మంది ఫెయిల్

- కృష్ణాలో 60 శాతం, ఎన్టీఆర్‌లో 48 శాతం ఉత్తీర్ణత

విజయవాడ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల్లో సగం మంది విద్యార్థులు ఫెయిలయ్యారు. కృష్ణాజిల్లా 60 శాతం, ఎన్టీఆర్ జిల్లా 48 శాతం ఉత్తీర్ణతను సాధించింది. కృష్ణాజిల్లా నుంచి మొదటి సంవత్సరం పరీక్షలకు 2,968 మంది హాజరవ్వగా 1,477 మంది ఉత్తీర్ణులయ్యారు. 51 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 1,832 మంది హాజరవ్వగా, 1,095 మంది ఉత్తీర్ణులయ్యారు. 60 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఎన్టీఆర్ జిల్లాలో మొదటి ఏడాది పరీక్షలకు 6,617 మంది హాజరవ్వగా 3,044 మంది ఉత్తీర్ణులవ్వడంతో 46 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ద్వితీయ సంవత్సరంలో 4,676 మంది హాజరవ్వగా, 2,233 మంది ఉత్తీర్ణులయ్యారు. 48 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

మాజీ ఎంపీ అంకినీడుకు ప్రముఖుల నివాళి



8లో

- ప్రజల సందర్శనార్థం చల్లపల్లి పురవీధుల్లో ఊరేగింపు

ఒకరిది స్వార్థం.. మరొకరిది అత్యాశ.. ఇంకొకరిది అవివేకం.. ఇంతమంది ఆడిన డబ్బులాటలో 55 ఏళ్లుగా ఎంతోమంది పేద పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పి, వారి ఉన్నతికి బాటలు వేసిన శాతవాహన కళాశాల నేలమట్టమైంది. ఈ కళాశాల స్థలాన్ని ఎలాగైనా కాజేయాలన్న కుతంత్రాలతో ఎంతో పేరున్న విద్యాశిఖరాన్ని నామరూపాల్లేకుండా శిథిలం చేశారు. తాతల నాటి స్థలం కన్నేసి కొట్టేయాలనుకున్నది ఒకరైతే, అసలు మనుగడే లేకుండా చేసేందుకు శ్రీదుర్గామల్లేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీలోని కొందరు పావులు కదిపారు. వీరంతా కలిసి ఆడిన ఆటలో శాతవాహన కనీసం కంటికి కూడా కనిపించకుండాపోయింది.



(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : శాతవాహన కళాశాల భవనాలను బోయపాటి శ్రీనివాస అప్పారావు, ధూళిపూడి శ్రీకాంత్ నేలమట్టం చేయడానికి ముందు విజయవాడ కేంద్రంగా కిడ్నాప్ కథ మిగతా 6లో..

దశాబ్దాల ప్రతిష్ఠను కూల్చేశారు..!

'శాతవాహన' కూల్చివేతలో దుష్టగ్రహాలెన్నో..

- స్వార్థపు ఆటకు బలైన సరస్వతీ నిలయం
- 'బోయపాటి'ని నడిపిస్తున్న 'కృష్ణ'లీల ఏంటి?
- **వివాదం కోర్టులో ఉండగానే 'డెవలప్‌మెంట్' దొంగాట**
- కూల్చివేతకు సరేనన్న ప్రిన్సిపాల్, కరస్పాండెంట్
- **ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రమేయమేంటి?**
- వివాదాలకు ఆజ్యంపోస్తున్న 'వంకాయలపాటి'
- డి అడ్రస్‌మాల్‌లో డీల్స్.. కిడ్నాప్ డ్రామాలు

అర్జున అవార్డు గ్రహీతలకు సన్మానం

6

మిన్నంటిన ఆగ్రహావేశాలు

8

మంగినపూడి బీచ్‌లో పర్యాటకుల కేరింతలతో మసులా బీచ్ ఫెస్టివల్ మూడో రోజు శనివారం సందడిగా సాగింది. ఫెస్టివల్‌కు లక్షలాదిగా పర్యాటకులు తరలివచ్చారు. స్టాళ్లను సందర్శిస్తూ, క్రీడలను తిలకిస్తూ, సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు.



సముద్రంలో బోట్ రైడింగ్ చేస్తున్న పర్యాటకులు



సందడే.. సందడి!

మసులా బీచ్ ఫెస్టివల్‌కు మూడో రోజు లక్షలాదిగా తరలివచ్చిన పర్యాటకులు



గుర్రపుస్వారీ, మోటార్ జీప్ రైడింగ్ చేస్తున్న చిన్నారులు





సీ కయాకింగ్ పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులు



యాంకరింగ్ చేస్తున్న సౌమ్యారావు



కయాకింగ్ పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, శాప్ చైర్మన్ రవినాయుడు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ

మంగినపూడి బీచ్‌లో రూ.1,500 కోట్లతో రిసార్టులు

- నిర్మించేందుకు ముందుకొస్తున్న కార్పొరేట్ సంస్థలు
- బీచ్‌కు జాతీయస్థాయిలో పేరు, ప్రఖ్యాతులు తెచ్చేందుకు కృషి: మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): 'బందరు పోర్టు పూర్తయితే మంగినపూడి బీచ్‌లో రూ.1500 కోట్లతో రిసార్టులు నిర్మిస్తామంటూ కార్పొరేట్ సంస్థలు ముందుకొస్తున్నాయి. జాతీయస్థాయి క్రీడల పోటీల నిర్వహణతో మంగినపూడి బీచ్ అందరి దృష్టిని ఆకర్షించింది. బీచ్‌కు జాతీయస్థాయిలో పేరు ప్రఖ్యాతులు తెచ్చేందుకు కృషి చేస్తా.' అని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మంగినపూడి బీచ్‌లో శనివారం నిర్వహిస్తున్న సీ కయాగింగ్, నేషనల్ లెవల్ వాలీబాల్, బీచ్ ఫుట్‌బాల్ పోటీలను శాప్ చైర్మన్ రవినాయుడు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావులతో కలిసి ఆయన సందర్శించారు. ఫెస్టివల్‌లో మంత్రి కొల్లు రవీంద్ర పారాగ్లైడింగ్ చేశారు. ప్రముఖ క్రీడాకారుడు జయప్రసాద్‌ను అభినందించారు. కయాకింగ్ అసోసియేషన్ ప్రతినిధులు తెచ్చిన చేతి సంచులను, టీషర్టులను ఆవిష్కరించారు. ఉత్సవాలు దేశమంతటా మార్మోగుతున్నాయని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు పేర్కొన్నారు. రాష్ట్రాన్ని టూరిజం, స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు అన్నారు.



పర్యాటకులకు దర్శనమిచ్చేలా పాండురంగస్వామి ప్రతిమ

మసూల బీచ్ ఫెస్టివల్‌లో నిలువెత్తు పాండురంగస్వామి ప్రతిమను ఏర్పాటు చేశారు. గేట్ వే ఆఫ్ అమరావతి నమూనాలో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేయగా, పర్యాటకులు తిరిగి వెళ్లే సమయంలో స్వామి వారికి దర్శనం ఇస్తున్నారు.



చిలకలపూడి రైల్వే స్టేషన్ వద్ద నిలిచిపోయిన వాహనాలు

ట్రాఫిక్‌లో చిక్కుకున్న మంత్రులు

మచిలీపట్నం టౌన్, కృత్తివెన్ను: మసులా బీచ్ ఫెస్టివల్స్‌కు శనివారం రాత్రి విచ్చేసిన మంత్రులు నారాయణ, కేపీ సారథి ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. ఈ విషయాన్ని మంత్రి నారాయణ విలేకరులకు తెలిపారు. మచిలీపట్నం నుంచి బీచ్ వద్దకు వచ్చేందుకు ఎస్పీ సాయంతో కాన్వాయ్‌తో వచ్చినా రెండు గంటలు పైనే పట్టిందని మంత్రి నారాయణ తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసులు ఎన్ని ఆంక్షలు విధించినా లక్షలాదిగా పర్యాటకులు తరలి రావటంతో నియంత్రణ కష్టమైంది. చిలకలపూడి రైల్వే గేటు నుంచి బీచ్ వరకు వేలాది వాహనాలు గంటల కొలదీ నిలిచిపోయాయి. మూడోరోజున దాదాపు నాలుగు లక్షల మంది యాత్రికులు, పర్యాటకులు రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చారు. ఆర్టీసీ బస్సులతో పాటు కార్లు, ఆటోలు, టూరిస్టు బస్సులు వచ్చాయి. పోలీసులు కేటాయించిన రూట్‌మ్యాప్ ద్వారా కాకుండా యాత్రికులు నేరుగా బీచ్‌కు వచ్చి, వెళ్లడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. 500 మంది పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ కోసం పనిచేసినప్పటికీ నియంత్రణ కష్టతరమైంది. వీఐపీలు, కళాకారులు ట్రాఫిక్‌లో చిక్కుకుని ఇబ్బందిపడ్డారు. గట్టి బందోబస్తు నిర్వహించాలని పోలీసులను ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆదేశించారు. ఆయన ట్రాఫిక్‌ను పరిశీలించారు.

కయాకింగ్ ఫైనల్స్‌కు చేరుకున్న రాష్ట్ర క్రీడాకారులు వీరే..

మచిలీపట్నం టౌన్: కయాకింగ్ 500 మీటర్ల పురుషుల విభాగంలో జి.భాస్కర్(ఏలూరు జిల్లా), ఎన్.రాజేష్ (కృష్ణాజిల్లా), బి.రాజు(విశాఖ), యు.సతీష్(విశాఖజిల్లా) రాష్ట్రం నుంచి ఫైనల్స్‌కు చేరుకున్నారు. 500 మీటర్ల మాస్టర్ విభాగంలో 12 మంది ఫైనల్స్‌కు చేరుకోగా రాష్ట్రానికి చెందిన డి.దేవదాస్ (నంద్యాల), పి.కనకయ్య (ఎన్టీఆర్), ఎం.రాజేష్(ఏలూరు) ఉన్నారు. అండర్-18 కయాకింగ్ 500 మీటర్ల విభాగంలో 12 మంది చేరుకోగా రాష్ట్రానికి చెందిన అభిలాష్ విఘ్నేష్, జి.గణేష్, టి.జాన్‌వెస్లీ, కె.ఈశ్వర్, కె.రోహిత్ సాయిమనోజ్, ఎల్.దివేశ్వర్, ఎం.ఈశ్వర్ ఉన్నారు.

పార్కింగ్‌లన్నీ ఫుల్

వాహనాలు భారీ సంఖ్యలో రావటంతో వాటిని పార్క్ చేసేందుకు పార్కింగ్‌లు ఫుల్ అయ్యాయి. మరికొన్ని పార్కింగ్ ప్రదేశాలను సిద్ధం చేసి, వాహనాల కోసం కేటాయిస్తున్నారు.

హోటళ్లు కిటకిట

బందరులోని అన్ని హోటల్ గదులు నిండిపోయాయి. కిటకిటలాడుతున్న హోటళ్లలో రూమ్‌లు దొరక్క, పర్యాటకులు విజయవాడ, భీమవరం, గుడివాడ పట్టణాలను ఆశ్రయిస్తున్నారు.

వెలిగిపోతున్న బీచ్

సముద్ర తీరంలో ప్రత్యేక ఎల్ఈడీ బల్బులతో వివిధ ఆకారాలు, ఆకృతుల్లో విద్యుత్ దీపాలతో బీచ్ వెలిగిపోతోంది.



పర్యాటకులతో కళకళలాడుతున్న బీచ్ పరిసరాలు



సినీ గీతాలు ఆలపిస్తున్న గాయకులు

ఉర్రూతలూగించిన సినీ సంగీత విభావరి

ప్రముఖ సినీ సంగీత దర్శకుడు సాయి కార్తీక్, ప్రవీణ్ సినీ గాయిని శ్రుతిగాయత్రి సినిమాపాటలతో యువతను ఉర్రూతలూగించారు. వేదికపై కళాకారుల నృత్యాలకు యువకులు స్టెప్పులు కలిపి కేరింతలు కొట్టారు.

ఆకట్టుకున్న కలంకారీ, పాండురంగడి ద్వారాలు



కలంకారీ ద్వారం నుంచి లోపలికి వెళుతున్న పర్యాటకులు

అవనిగడ్డ: బీచ్ ఫెస్ట్‌కు చేరుకునేందుకు వచ్చే మార్గంలో పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన పాండురంగడిద్వారం(ఐకానిక్ గేట్), కలంకారీ ద్వారాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పెడన కలంకారీ వైభవాన్ని ప్రతిబింబించేలా ఐకానిక్ గేటు దగ్గర నుంచి ప్రధాన వేదిక వరకు దారిపొడవునా కలంకారీ వస్త్రాలతో ద్వారాలను, సైడ్ వాల్స్ ఏర్పాటు చేశారు. చిలకలపూడిలోని పాండురంగ స్వామి ఆలయమూర్తి నమూనాను ఐకానిక్ గేటు వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేయగా, పలువురు నమూనా స్వామిని దర్శించుకున్నారు. ఐకానిక్ గేటు దగ్గర నుంచి ప్రధాన వీధుల వరకు రహదారి పొడవునా మత్స్యకారుల జీవన పోరాటం విశదీకరించేలా పడవల్లో వారు చేసే సాహసాలతో కూడిన ప్రతిమను తయారు చేసి ప్రదర్శనగా ఉంచారు. వాటి వద్ద సెల్ఫీలు దిగేందుకు చిన్నారులు, యువత పోటీపడ్డారు.



ప్యారా రైడ్ చేస్తున్న మంత్రులు పి.నారాయణ, కేపీ సారథి

బీచ్‌లో మంత్రుల ప్యారారైడ్

మచిలీపట్నం (కృత్తివెన్ను) జూన్ 7(ఆంధ్రజ్యోతి): మసులా బీచ్ ఫెస్టివల్‌కు విచ్చేసిన మంత్రులు పి.నారాయణ, కేపీ సారథి ప్యారారైడ్ చేశారు. వారిని మంత్రి కొల్లు రవీంద్ర దగ్గరుండి ప్యారా రైడ్ ఎక్కించారు. ఒకరి తరువాత ఒకరు గాల్లో చక్కర్లు కొట్టారు. ప్యారా రైడ్ మంచి అనుభూతిని ఇచ్చిందని, మచిలీపట్నంను, బీచ్‌ను కొత్త కోణంలో చూశామని, ప్రేక్షకుల వినోదం కోసం ఏర్పాటు చేసిన అన్ని కార్యక్రమాలు ఎంతో ఆహ్లాదంగా ఉన్నాయని, పర్యాటకులు పాల్గొని, అమితానందాన్ని పొందాలని మంత్రులు సూచించారు.



జస్టిస్ టి.మల్లికార్జునరావుకు వేద ఆశీర్వచనాలు అందజేస్తున్న అలయ అర్చకులు

మంటాడ వేంకటేశ్వరస్వామి సేవలో జస్టిస్ టి.మల్లికార్జునరావు దంపతులు

పమిడిముక్కల, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మంటాడలో అలివేలు మంగా పద్మావతి సమేత వైకుంఠ వేంకటేశ్వరస్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు దంపతులు శనివారం దర్శించుకుని పూజలు చేశారు. ఆలయానికి విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తి దంపతులు, వారితో ఉన్న ఉయ్యూరు జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీహరికి ఆలయ అధికారి మాధవీలత స్వాగతం పలికారు. దర్శనమయ్యాక ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనాలు అందించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలను అందజేశారు. ఉయ్యూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపిచంద్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష రేపు

చల్లపల్లి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పాగోలులోని ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌లో 2025-26 విద్యా సంవత్సరంలో 6, 7 తరగతుల్లో స్థానిక విద్యార్థుల ప్రవేశానికి సోమవారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలో ఎంపికైన విద్యార్థులకు 6, 7 తరగతుల్లో డేస్కాలర్‌గా ఉచిత విద్యను అందిస్తామని ఆమె పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు ఎన్టీఆర్ స్కూల్‌లో ప్రవేశ పరీక్షకు హాజరు కావాలని ఆమె సూచించారు. ట్రస్ట్ సీఈవో కె.రాజేంద్రకుమార్(విశ్రాంత ఐపీఎస్) పర్యవేక్షణలో పరీక్షకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేశారు.

అర్జున అవార్డు గ్రహీతలకు సన్మానం



అర్జున అవార్డు గ్రహీతను సత్కరిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ డీకే బాలాజీ, శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు

మచిలీపట్నం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మసులా బీచ్ ఫెస్టివల్ సందర్భంగా మచిలీపట్నం వచ్చిన అర్జున అవార్డు గ్రహీతలను, వివిధ క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణించిన క్రీడాకారులను మంత్రి కొల్లు రవీంద్ర, శాప్ చైర్మన్ రవినాయుడు, కలెక్టర్ బాలాజీ ఘనంగా సత్కరించారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో శనివారం క్రీడా రంగంలోని ప్రముఖులతో మంత్రి సమావేశం నిర్వహించారు. మంగినపూడి బీచ్, గిలకలదిండి హార్బర్ ప్రాంతాల్లో బీచ్ కబడ్డీపోటీలు, జలక్రీడలు, కయా కింగ్ పోటీల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలు, క్రీడాకారులకు కోచింగ్ ఇచ్చేందుకు తీసుకోవాల్సిన చర్యలు, అందుకు అవసరమైన భూమి కేటాయింపులు, నిధులు, ఆయాక్రీడల్లో కోచ్‌ల నియామకం తదితర అంశాలపై క్రీడారంగానికి చెందిన నిపుణులతో చర్చించారు. కబడ్డీ పోటీలలో అర్జున అవార్డు గ్రహీతలు నీతాదాద్వే, మమతా పుజారి, జస్విసింగ్, జలక్రీడల విభాగంలో అర్జున అవార్డు గ్రహీత ప్రాచి యాదవ్‌ను సత్కరిం చారు. కయాకింగ్ ప్రతినిధులు బి.బలరాంనాయుడు, ఆర్.ప్రదీప్‌నాయుడు, కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ డెప్యూటీ డైరెక్టర్ దీపాఠాకూర్, సీ వెంచర్ బీచ్‌గేమ్స్ ఆఫ్ ఇండియా సీఈవో యోగేష్, క్రీడాసంఘాల ప్రతినిధులు ఎస్ఆర్ శిల్ప, సెబాస్టియన్, సీహెచ్ శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, కబడ్డీ క్రీడాకారులు మంగళదే శాయ్, ఎన్.రామారావు తదితరులను శాప్‌చైర్మన్ రవినాయుడు, మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ బాలాజీ సత్కరించారు.

క్రీడల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై పూర్తిస్థాయి నివేదిక

మచిలీపట్నంలో బీచ్ కబడ్డీ ఇతర క్రీడల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై పూర్తిస్థాయి నివేదికను తయారుచేసి ఇస్తామని క్రీడా నిపుణులు తెలిపారు. విశాఖపట్నంలో గతంలో కబడ్డీ కోచ్‌లు ఉండేవారని, వారు పదవీ విరమణ చేయడంతో ఆ పోస్టులు ఖాళీగా ఉన్నాయని కబడ్డీ క్రీడాకారులు తెలిపారు. హరియాణ నుంచి కోచ్‌ను సొంత ఖర్చులతో నియమించుకుని కోచింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, డీఆర్వో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఇష్టారాజ్యం!

(5వ పేజీ తరువాయి)

నుంచి సిఫార్సు లేఖలు తెచ్చుకున్న ఉద్యోగులను ఆ మండలంలో నియమించాలంటే ప్రస్తుతం అక్కడ పనిస్తున్న ఉద్యోగులను మరో ప్రాంతానికి బదిలీ చేయాలి. కానీ వారు అసలు బదిలీ కోసం దరఖాస్తు చేసుకోకుండానే బదిలీ కావాల్సి వస్తోంది. సంబంధిత ఉద్యోగులను మండలాల నుంచి బదిలీ చేయాలంటే సహేతుకమైన కారణాలను స్పష్టంగా నమోదు చేయాలి. దీంతో జెడ్పీ అధికారులు తమపై ఎలాంటి రిమార్కు రాకుండా జాగ్రత్తలు తీసుకునే కార్యక్రమంలో భాగంగా కొత్త విధానానికి తెరతీశారు. ప్రజాప్రతినిధుల సూచనలను అమలు చేసేందుకు గాను ఇప్పటికే ఆ ప్రాంతంలో పనిచేస్తున్న ఉద్యోగులను జెడ్పీ కార్యాలయానికి పిలుస్తున్నారు. మీరు ఇప్పటివరకు బదిలీ కోసం దరఖాస్తు చేసుకోలేదని, మీరు బదిలీ కావడం ఖాయమని, ఇప్పటికైనా బదిలీ కోసం దరఖాస్తు చేసుకుంటే కోరుకున్న, దగ్గరలోని ప్రాంతానికి బదిలీపై వెళతారని, లేకుంటే ఎక్కడకు బదిలీ అవుతారో తెలియదని బెదిరింపు ధోరణిలో చెప్పి బదిలీ కోసం దరఖాస్తు చేయిస్తున్నారు. దీంతో అధికారులు, ఉద్యోగులు ఖంగుతింటున్నారు. ఈ తరహాలో పిలుపులు అందుకున్న వారిలో ఎంపీడీవో స్థాయి నుంచి జూనియర్ అసిస్టెంట్ స్థాయి వరకు 30 మంది వరకు ఉన్నారని ఉద్యోగులు చెప్పుకుంటున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో జెడ్పీలో బదిలీల వ్యవహారం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.

దశాబ్దాల ప్రతిష్ఠను కూల్చేశారు..!

(5వ పేజీ తరువాయి)

నడిచింది. కళాశాల ప్రిన్సిపాల్ వంకాయలపాటి శ్రీనివాస్ తనను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ వ్యక్తిగత సహాయకుడు, మరికొంత మంది కిడ్నాప్ చేశారని హంగామా చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వారు తన ఇంటి ముందు రెక్కీ నిర్వహించారని శ్రీనివాస్ కుమారుడు సత్యనారాయణపురం పోలీసులకు ఫిర్యాదు కూడా చేశాడు. ఎంజీ రోడ్డులో ఉన్న డి అడ్రస్‌మాల్‌కు వెళ్లి బయటకు వస్తున్నప్పుడు ఆలపాటి మనుషులు కిడ్నాప్ చేసి గుంటూరుకు తరలించారని, తన సెల్‌ఫోన్ లాక్కుని వారికి కావాల్సిన కాగితాలపై సంతకాలు చేయించుకున్నారని వంకాయలపాటి శ్రీనివాస్ ఆరోపించారు. తనకు ప్రాణహాని ఉందని, ఆలపాటి రాజేంద్రప్రసాద్, అతని అనుచరులపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని కళాశాలలో జరిగిన విలేకరుల సమావేశంలో అన్నారు. ఆ తర్వాత కిడ్నాప్‌పై ఆయన ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. ఆ తర్వాత మౌనంగా ఉండిపోయారు. వాస్తవానికి సుప్రీంకోర్టులో జరిగే పరిణామాల గురించి ఈ ముఠాకు ముందే సమాచారం ఉంది. దీనికి సంబంధించిన డీల్‌ను సెట్ చేసుకోవడానికి శ్రీనివాస్ కొద్దిరోజుల క్రితం డి అడ్రస్‌మాల్‌లో ఉన్న శ్రీకాంత్ వద్దకు వెళ్లినట్టు తెలుస్తోంది.

'డెవలప్‌మెంట్' మాయ

ఎంజీ రోడ్డులో ఉన్న డి అడ్రస్‌మాల్ అధినేత ధూళిపూడి శ్రీకాంత్ శాతవాహన ప్రాంగణంలోకి అడుగుపెట్టడానికి చాలా తెలివిగా వ్యవహరించాడు. శాతవాహన భూములకు సంబంధించి సుప్రీంకోర్టులో తీర్పు రాకుండానే ఆ భూములు తనవేనని చెప్పుకొంటున్న బోయపాటి శ్రీనివాస అప్పారావుతో డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ చేసుకోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. సాధారణంగా ఏ డెవలపర్ అయినా ఎలాంటి వివాదాలు లేని భూములపై ఒప్పందాలు చేసుకుంటారు. అటువంటిది శ్రీకాంత్ కోర్టు వివాదాల్లో నలుగుతున్న శాతవాహన భూములను డెవలప్ చేయడానికి ఎందుకు ఆసక్తితో అడుగులు వేశారన్నది అనుమానమే. శాతవాహన కళాశాలలోకి ఎక్స్‌కవేటర్లను తీసుకెళ్లిన రోజున బోయపాటి శ్రీనివాస అప్పారావుతో పాటు శ్రీకాంత్ కూడా ఉన్నట్టు పోలీసులు నిర్ధారించారు. ఓ థియేటర్‌లో భాగస్వామిగా ఉన్న 'కృష్ణ'లీల ఈ కథంతా నడిపిస్తున్నట్టు ప్రచారం నడుస్తోంది. కాగా, కళాశాలను కూల్చుకోవచ్చని కరస్పాండెంట్ రమాసత్యనారాయణ, ప్రిన్సిపాల్ వంకాయలపాటి శ్రీనివాస్ రాతపూర్వకంగా అనుమతి ఇచ్చారని కూడా పోలీసులు నిర్ధారించారు.

వివాదాలకు ఆజ్యం ఇలా..

శాతవాహన కళాశాల ఉన్న భూమి తమకు అగ్రిమెంట్ చేశారని, రిజిస్ట్రేషన్‌కు బోయపాటి అప్పారావు ముందుకు రావట్లేదని శ్రీదుర్గామల్లేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీ కోర్టును ఆశ్రయించింది. ఈ వివాదం ఏళ్ల తరబడి నడుస్తూనే ఉంది. 2009వ సంవత్సరంలో సొసైటీ కార్యదర్శిగా, కళాశాల కరస్పాండెంట్‌గా తాత్కాలిక బాధ్యతలు చేపట్టిన వంకాయలపాటి కామేశ్వరరావు ఈ వివాదాలకు ఆజ్యం పోశారు. అప్పటి వరకు ఒకటిగా ఉన్న సొసైటీలో చీలికలు తీసుకొచ్చారు. సొసైటీ కార్యదర్శి, కళాశాల కరస్పాండెంట్‌గా ఉన్న గుండవరపు ప్రజాపతిరావు అమెరికా వెళ్తూ ఆ బాధ్యతలు తాత్కాలికంగా కామేశ్వరరావుకు అప్పగించారు. సమాచార శాఖలో ఉద్యోగిగా ఉన్న కామేశ్వరరావుకు ఊహించని పదవులు రావడంతో అత్యాశలకు పోయాడు. ప్రజాపతిరావు లేని సమయం చూసుకుని కళాశాలకు ఏమాత్రం సంబంధం లేని ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు గేట్లు తెరిచారు. ఆయన రంగప్రవేశం చేశాక సొసైటీలో వివాదాలు పెరిగిపోయాయి. కామేశ్వరరావును అడ్డుపెట్టుకుని ఆయన కుమారుడు వంకాయలపాటి శ్రీనివాస్ తెరవెనుక వ్యవహారాలను చక్కబెట్టినట్టు ఆరోపణలు ఉన్నాయి.

ఆలపాటికేం సంబంధం..?

శాతవాహన కళాశాల, శ్రీదుర్గామల్లేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీతో అసలు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు సంబంధం ఉందా? అనే ప్రశ్న వ్యక్తమవుతోంది. బోయపాటి శ్రీనివాస అప్పారావు, ధూళిపూడి శ్రీకాంత్, వంకాయలపాటి శ్రీనివాస్, ప్రస్తుత కరస్పాండెంట్ నిడుమోలు రమాసత్యనారాయణపై పోలీసులకు ఆయన ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దుర్గామల్లేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీకి కార్యదర్శి హోదాలో ఈ ఫిర్యాదు చేశారు. ఆలపాటికి సొసైటీలో కానీ, కళాశాలలో కానీ ఎలాంటి పదవులు లేవని కొంతమంది చెబుతున్నారు. ప్రస్తుతం శాతవాహన కళాశాల కరస్పాండెంట్‌గా నిడుమోలు రమాసత్యనారాయణ వ్యవహరిస్తున్నారు. కరస్పాండెంట్‌గా ఉన్నవారే సొసైటీ కార్యదర్శిగా వ్యవహరించిన సందర్భాలు ఉన్నాయి. దాని ప్రకారం తానే కార్యదర్శి, కరస్పాండెంట్ హోదాలో ఉన్నానని రమాసత్యనారాయణ చెబుతున్నారు. ఇదివరకు ఈ కార్యదర్శి పదవి విషయంలో ఆలపాటికి ఎదురుదెబ్బ తగిలినట్టు తెలుస్తోంది. స్థానికత లేనందున ఆలపాటి సొసైటీ కార్యదర్శి, కళాశాల కరస్పాండెంట్ పదవులను చేపట్టడానికి అర్హత లేదని అప్పటి కలెక్టర్ రిజ్వి ఆదేశాలు ఇచ్చినట్టు సమాచారం. ఇదంతా ఇలా ఉంటే.. శాతవాహన కళాశాల భవనం కూల్చివేత నేపథ్యంలో కార్యదర్శి హోదాలో పోలీసులకు ఫిర్యాదు చేయటం కొసమెరుపు. ఒకవేళ కార్యదర్శి హోదాలో ఆలపాటి కొనసాగితే కూల్చివేతలు జరిగిన ప్రదేశానికి ఆయన ఎందుకు రాలేదన్న ప్రశ్న కూడా వినిపిస్తోంది. గతంలో శాతవాహన స్థలాన్ని సొసైటీ ముసుగులో చేజిక్కించుకునే ప్రయత్నం చేశారన్న అనేక ఆరోపణలు కూడా ఆలపాటిపై ఉన్నాయి.

పెనమలూరు

● పెనమలూరు ● గన్నవరం

అంతరించిపోతున్న కళలను కాపాడుకోవాలి

గన్నవరం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : అంతరించిపోతున్న సంస్కృతి, సంప్రదాయాలు, కూచిపూడి వంటి నృత్యాలను, కళలను కాపాడుకోవాలని గన్నవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వీవీ కృష్ణమోహన్ అన్నారు. నటరాజ్ డాన్స్ అండ్ మ్యూజిక్ ట్రస్ట్ అకాడమీ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు ముగింపు సభ స్థానిక మల్లికార్జున విద్యాసంస్థల ప్రాంగణంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు వేసవి సెలవులను దుర్వినియోగం చేసుకోకుండా భరతనాట్యం, కూచిపూడి నృత్యం లాంటివి నేర్చుకోవడం అభినందనీయమన్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, హెచ్ఎం కేస్ జగదీశ్వరరావు మాట్లాడుతూ, ఫోన్‌కు ఎడిట్ కాకుండా సాంప్రదాయ నృత్యాలను నేర్చుకోవడం మంచి విషయమన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. అకాడమీ చైర్మన్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ నిరంజన్, కొల్లూరి దివ్య, కే విజయబాబు డాక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే గుంతే!

- గండిగుంట పంచాయతీ పరిధి ఆనందపురం వద్ద విజయవాడ - మచిలీపట్నం జాతీయ రహదారి పక్కన ప్రమాదకరంగా గుంత
- రాత్రి సమయంలో గుంతలో పడి గాయాలపాలవుతున్న వాహనదారులు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



జాతీయ రహదారి పక్కన ప్రమాదకరంగా గుంత

(ఉయ్యూరు - ఆంధ్రజ్యోతి)

గండిగుంట పంచాయతీ పరిధి ఆనందపురం వద్ద విజయవాడ - మచిలీపట్నం జాతీయ రహదారి పక్కన వాటర్ పైప్‌లైన్ మరమ్మతు నిమిత్తం తవ్విన పెద్ద గుంత ప్రమాదకరంగా ఉంది. జాతీయ రహదారి పక్కన ఉన్న పైపులైన్ లీకై నీరు వృథాగా పోతున్న పరిస్థితుల్లో మరమ్మతు చేసేందుకు వారం రోజుల క్రితం పంచాయతీ సిబ్బంది పెద్ద గుంత తవ్వి వదిలేశారు. దీంతో జాతీయ రహదారిపై వాహనాలపై వెళ్లేవారు గుంతలో పడి గాయాలపాలవుతన్నారు. జాతీయ రహదారి మీదకు వెళ్ళే దారిలేక ఆనందపురం వాసులు గుంతతో ఇబ్బందిపడుతున్నారు. గుంత తవ్వి మరమ్మతు చేయకుండా వదిలి వేయడంతో నీరు వృథాగా పోతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైప్‌లైన్ మరమ్మతు చేసి గుంత పూడ్చాలని కోరుతున్నారు.





కానూరు సిద్దిక్ నగర్‌లో జరిగిన బక్రీద్ ప్రార్థనల్లో ముస్లింలు.. ముస్తాబాద్‌లో సందేశం ఇస్తున్న మసీద్ ఇమామ్ ఆసిఫ్ ఇక్బాల్

భక్తి ప్రపత్తులతో బక్రీద్

మసీదులు, ఈద్గాల వద్ద ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు



ఉయ్యూరు ఈద్గా వద్ద బక్రీద్ ప్రార్థనల్లో ముస్లింలు

ఉయ్యూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు, పరిసర గ్రామాల్లో శనివారం బక్రీద్ పండుగను భక్తి ప్రపత్తులతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా పెద్దమసీదు, దయార మసీదు, చిన్నమసీదుతో పాటు ఇతర మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి ఈద్గా వద్ద ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం గోరీ మసీదుకు చేరుకుని పెద్దలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా చిన పెద్ద తేడా లేకుండా ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. త్యాగం, అనురాగం, దానగుణాలను పెంపొందించే పండుగ బక్రీద్ అని ముస్లింలకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. నిస్వార్థమైన ఆత్మీయ, అనుబంధాలను వ్యాపింపజేయడమే బక్రీద్ పండుగ ముఖ్య ఉద్దేశమని, ఈ సందర్భంగా ప్రవక్త ఇబ్రహీమ్ త్యాగ నిరతిని స్మరించుకున్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ అబుకలామ్, కో-ఆప్షన్ సభ్యుడు ఖలీల్, సలీమ్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్తార్, జలీల్, ఉయ్యూరు మాజీ చైర్మన్ ఖుద్దూస్, టీడీపీ నాయకుడు అల్‌రియాజ్ తదితరులు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

కానూరులో..

కానూరు : బక్రీద్ సందర్భంగా ముస్లింలు శనివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కానూరు, సనత్‌నగర్‌లోని ఈద్గాలో, సిద్దిక్ నగర్‌లోని మక్కామసీద్‌లో, పిన్నమనేని టీచర్స్ కాలనీ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ముస్లింలు నమాజ్ చేసి ప్రార్థనలు నిర్వహించారు. ముస్లింలోపాటు నేతలు అబ్దుల్ ఖాదర్, రియాజ్, ఫాజీల్, వాయద్, షేక్ బుజ్జి, ఆనీస్ బాషా, ముక్తీ పాల్గొన్నారు.

ముస్తాబాదలో..

గన్నవరం : త్యాగం, సహనం, విశ్వాసం, కరుణ, ఐక్యతకు ప్రతీక బక్రీద్ అని జామియా మస్జిద్ ఇమామ్ హసీన్ ఇక్బాల్ అన్నారు. మండలంలో బక్రీద్‌ను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ముస్తాబాద ఈద్గాలో జరిగిన బక్రీద్ ప్రత్యేక ప్రార్థనలలో ఇక్బాల్ ప్రసంగిస్తూ ముస్లింలు జరుపుకునే పవిత్ర పండుగ బక్రీద్ అన్నారు. మనిషి దైవానికి ప్రీతిపాత్రుడు కావాలన్నా, తోటి మానవుల హృదయాల్లో కొలువు తీరాలన్నా త్యాగమే ఉత్తమ మార్గమని ప్రవక్త ఇబ్రహీం జీవితం చెబుతుందాన్నారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలకు భయపడకుండా, దేవునిపై విశ్వాసంతో సన్మార్గంలో జీవనం సాగించాలని, బక్రీద్ పండుగ మానవాళికి గొప్ప సందేశాన్ని ఇస్తుందన్నారు. అల్లా ఆదేశానుసారం ఇబ్రహీం తన ఏకైక పుత్రుడైన ఇస్మాయిల్‌ను బలిఇవ్వడానికి సిద్ధమౌతాడని, ఆ సంప్రదాయాన్ని స్మరిస్తూ ముస్లింలు ఈ బక్రీద్ పండుగను జరుపుకుంటారని తెలిపారు. ఈద్గా వద్ద ముస్లిం కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జంక్షన్‌లో..

హనుమాన్‌జంక్షన్ : బక్రీద్ పర్వదినం పురస్కరించుకొని శనివారం స్థానిక ఏలూరు రోడ్డులోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏలూరు రోడ్డులోని మదీనా మసీద్ ఇమామ్ షఫీకుర్ రెహమాన్ ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు. పెద్ద ఎత్తున ముస్లింలు పాల్గొని దైవ ప్రవక్త ఇబ్రహీం త్యాగాన్ని స్మరించుకుంటూ ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మదీనా మసీద్ నౌజవాన్ అంజుమన్ కమిటీ నాయకులు షేక్ మౌలాలి,షేక్ మీర్జావలి, షేక్ మీరా,షేక్ అబ్దుల్ రెహమాన్ తదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కాగా స్థానిక ఎంజీనగర్ మసీదు, జమాతే ఇస్లామీ హింద్ ప్రార్థనా మందిరంలో కూడా ముస్లింలు బక్రీద్ ప్రార్థనలు నిర్వహించారు.



శ్రీవారి తిరుకల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

వైభవంగా శ్రీవారి తిరుకల్యాణోత్సవం

● నేడు అఖండ అన్నసమారాధన

పెనమలూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : పోరంకి లక్ష్మీపురం కాలనీలోని పద్మావతి గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజజీయర్‌స్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో శ్రీవారి తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాద వితరణ చేశారు. 8న ఆదివారం సుప్రభాతసేత, నవపుష్పార్చణ పూర్వక శ్రీపుష్పయాగం నిర్వహిస్తారు. అనంతరం ఉదయం 11 గంటలకు అఖండ అన్న సమారాధన నిర్వహించనున్నట్టు అర్చకస్వాములు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించాల్సిందిగా కోరారు.

పనిచేసేవారికి గుర్తింపు లేదు

వైసీపీకి, ఎంపీటీసీ పదవికి చిట్టూరి రాజీనామా



చిట్టూరి ప్రసాద్

కంకిపాడు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : పార్టీకి కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు వైసీపీలో తగిన గుర్తింపు లేదని, పార్టీకి పదవికి రాజీనామా చేస్తున్నట్లు కంకిపాడు ఎంపీటీసీ - 1 చిట్టూరి ప్రసాద్ తెలిపారు. స్థానిక విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ, 2014 నుంచి వైసీపీ జెండా మోసి పార్టీని అధికారంలోకి తీసుకువచ్చామని, 2024లో ఓటమి పాలైనప్పటికీ పార్టీ కోసం కష్టపడుతున్నామని అయినా గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

మద్యం మత్తులో యువకుల కొట్లాట

శివాలయం రోడ్డులో నిలిచిన ట్రాఫిక్

ఉయ్యూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శివాలయం రోడ్డులో శనివారం రాత్రి మద్యం మత్తులో యువకులు కొట్లాటకు దిగి వీరంగం సృష్టించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ప్రధాన సెంటర్‌కు సమీపాన శివాలయం రోడ్డులో కొందరు యువకులు పిడిగుద్దులు గుద్దుకుంటూ అలజడి సృష్టించడంతో కొద్దిసేపు ట్రాఫిక్ నిలచిపోయింది. ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితుల్లో అక్కడ ఉన్నవారు భయపడి పోయారు. కొట్టుకుని వెళ్లిపోయిన తరువాత పోలీసు వచ్చి హడావిడి చేశారు. కాగా కొన్ని రోజుల క్రితం స్థానిక విజయవాడ బస్‌స్టాప్ వద్ద ఆటో డ్రైవర్లు పట్టపగలు కొట్టుకుంటూ బీభత్సం సృష్టించారు. గంజాయి మత్తులో యువకులు పేట్రేగి పోతున్నారని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పోలీసుల తీరుపై తీవ్రంగా మండిపడుతున్నారు.



ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, ఇతర నాయకులు

మర్యాదపూర్వక కలయిక

న్యూజిలాండ్ డిప్యూటీ ప్రధానిని కలిసిన ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : సతీసమేతంగా న్యూజిలాండ్ పర్యటనలో ఉన్న స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ శనివారం న్యూజిలాండ్ ఉప ప్రధాని బ్రూక్ వాన్ వెల్డెన్, ఆదేశ ఎంపీ పరమ్‌జీత్ పర్మార్‌లను ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ వైస్ చైర్మన్ అట్లూరి అశ్విన్‌కుమార్, నందమూరి రామకృష్ణ, ఎమ్మెల్సీ టీడీ జనార్దన్‌తో కలిసి మరాద్యపూర్వకంగా కలిశారు. తర్వాత మేల్బోర్న్‌లో జరిగిన ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవంలో పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన జీవితానికి ఆటవిడుపు అవసరం



కళాకారులకు బహుమతులు అందజేసిన టీడీపీ గోసాల అధ్యక్షులు షేక్ మాబు సుబాని, ఎందువ రాంబాబు

గోసాల (కంకిపాడు) జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : నిత్యం పరుగులు పెట్టే జీవితంలో కాస్తంత ఆటవిడుపు అవసరమని కంకిపాడు మార్కెట్ డైరెక్టర్, గోసాల టీడీపీ అధ్యక్షులు షేక్ మాబు సుబాని అన్నారు. పద్మశ్రీ ఘంటసాల, ఎన్టీఆర్ స్మారక సంగీత కళాపీఠం (కంకిపాడు) ఆధ్వర్యంలో పెనమలూరు మండలం గోసాల వేణుగోపాల స్వామి ఆలయంలో శనివారం పాటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన షేక్ సుబాని మాట్లాడుతూ, నిత్యం పరుగులు పెట్టే ప్రస్తుత తరుణంలో ప్రతి ఒక్కరికీ కాస్తంత ఆటవిడుపు అవసరమన్నారు. ఆటల పోటీలు, పాటల పోటీలు అంటూ కళాపీఠం ముందుకొచ్చి నిర్వహించటం ఆనందదాయకమన్నారు. ప్రథమ బహుమతి కె.ఎస్.వి.డి ప్రసాద్ (పాలకొల్లు), ద్వితీయ బహుమతి ఆర్ మనోహర్ (దర్శి), తృతీయ బహుమతి జె. సాయికుమారి (పాలకొల్లు) నిలిచారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎందువ రాంబాబు, వణుకూరు లక్ష్మి, రాఘవేంద్రరావు, కంకిపాడు ఘంటసాల కళాపీఠం అధ్యక్షులు బాపట్ల నాగేశ్వరరావు, అడెపు సాంబశివరావు, కాటూరు వెంకట మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ

గుర్తుతెలియని వ్యక్తి మృతి



మృతుడు

పెనమలూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): డ్రెయిన్‌లో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటనపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. 35-40సంవత్సరాల వయసున్న ఒక గుర్తుతెలియని వ్యక్తి గురువారం మద్యం సేవించి కానూరు నుంచి మురళీనగర్ వైపు నడుచుకొంటూ వెళుతూ మద్యం మత్తులో దగ్గర్లోని డ్రెయినేజీలో పడిపోయాడు. చుట్టుపక్కల వారు అతడిని చూసి ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మిన్నంటిన ఆగ్రహావేశాలు

జగన్ పత్రిక కార్యాలయ ఆవరణలో తెలుగు మహిళల ఆందోళన ● వేశ్యల రాజధానిగా అభివర్ణించటంపై జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు ● పత్రిక ప్రతులను దగ్ధం చేసిన ఎన్డీఏ కూటమి మహిళా నేతలు

ఆంధ్రజ్యోతి, విజయవాడ: అమరావతిని వేశ్యల రాజధానిగా సాక్షి చానెల్‌లో అభివర్ణించిన జర్నలిస్ట్ కృష్ణంరాజు వ్యాఖ్యలను నిరశిస్తూ తెలుగు మహిళలు సాక్షి కార్యాలయాన్ని శనివారం ముట్టడించారు. ఎన్టీఆర్ జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు చెన్నుపాటి ఉషారాణి నేతృత్వంలో మహిళలు సాక్షి కార్యాలయ ఆవరణలోకి ప్రవేశించి అక్కడే బైఠాయించి ధర్నా చేపట్టారు. దేవతల రాజధాని అమరావతిని వేశ్యల రాజధానిగా చిత్రీకరించే ప్రయత్నం చేయటం దుర్మార్గమని మండిపడ్డారు. రాజధాని అమరావతి ప్రాంతంలో భారతీ రెడ్డి ఉంటున్నారన్న సంగతి మరిచి వేశ్యల రాజధానిగా ఎలా అంటారని ప్రశ్నించారు. నీలి మీడియాలో రాజధాని మహిళలను వేశ్యలుగా చిత్రీకరించే ప్రయత్నంలో కుట్ర కోణం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అమరావతిని దేవతల రాజధానిగా ముఖ్యమంత్రి చంద్రబాబు అభివర్ణిస్తూ మహిళల గౌరవాన్ని పెంచితే వేశ్యల రాజధానిగా అభివర్ణిస్తూ మహిళల గౌరవాన్ని వైసీపీకి చెందిన సాక్షి మీడియా దెబ్బతీసిందన్నారు. భారతీరెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ లోపు వర్షం పడుతుండటంతో తప్పనిసరి పరిస్థితులో ఆందోళన విరమించారు. ఆశ, మాదాల రాజ్యలక్ష్మి, నాగమణి, సుకాసి సరిత, చెరుకూరి మాధవి, వీరపనేని అరుణ, లక్ష్మీ సౌజన్య పాల్గొన్నారు.





విజయవాడలో జగన్ పత్రిక కార్యాలయ ఆవరణలో ఆందోళన చేస్తున్న తెలుగు మహిళలు, గన్నవరం టీడీపీ కార్యాలయం వద్ద సాక్షి పత్రికను దగ్ధం చేస్తున్న ఎన్డీఏ కూటమి మహిళా నేతలు

కృష్ణంరాజు క్షమాపణ చెప్పాలి: ఏపీయూడబ్ల్యూజే అర్బన్ యూనిట్

గాంధీనగర్: అమరావతి ప్రాంత మహిళలను కించపరస్తూ అసభ్యకరంగా జర్నలిస్టు, మ్యాగజైన్ ఎడిటర్ వీవీఆర్ కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలను ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స (ఏపీయూడబ్ల్యూజే) విజయవాడ అర్బన్ యూనిట్ తీవ్రంగా ఖండించింది. ఒక పత్రిక ఎడిటర్‌గా ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరైంది కాదన్నారు. తక్షణమే అమరావతి ప్రాంత మహిళలతో పాటు రాష్ట్ర ప్రజలకు భేషరతుగా క్షమాపణలు చెప్పాలని యూనియన్ అధ్యక్ష,కార్యదర్శులు చావా రవి, దారం వెంకటేశ్వరరావు, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కంచల జయరాజ్, దాసరి నాగరాజు, సామ్నా నేత రమణారెడ్డి, ఐజేయూ నేత ఎస్‌కే. బాబు, స్టేట్ కౌన్సిల్ సభ్యుడు జి.రఘురాం, నాగ మల్లేశ్వరరావు ఆ ప్రకటనలో డిమాండ్ చేశారు.

ఏపీఎంపీఏ ఖండన

విజయవాడ: అమరావతి వేశ్యల రాజధాని అంటూ ఆ ప్రాంత మహిళలను అవమానిస్తూ జర్నలిస్టు వీవీఆర్ కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలపై ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఒక ప్రకటనలో ఖండించింది. ఆయన వ్యాఖ్యలు గుజుప్సాకరంగా ఉన్నాయని ఆయన తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని రాజధాని ప్రాంత మహిళలకు, రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఏపీఎంపీఏ రాష్ట్ర అధ్యక్షుడు వీర్ల శ్రీరామ్ యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు యేమినేని వెంకట రమణ, రాష్ట్ర కోశాధికారి మత్తి శ్రీకాంత్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పసుపులేటి చైతన్య, నేతలు రాజా, గుర్రం శ్రీనివాసరావు, వేల్పుల ప్రశాంత్, కోటేశ్వరరావు డిమాండ్ చేశారు.

దేవతల రాజధానిపై దుర్భాషలా?: బీజేపీ మహిళా మోర్చా

రాజధాని పునర్నిర్మాణ శంకుస్థాపన జరిగి, ప్రధాని మోదీ రాజధానిని కొనియాడిన కొన్ని రోజులకే దేవతల రాజధాని అమరావతిని వేశ్యల రాజధాని అనడాన్ని దానిని సాక్షి టీవీలో సమర్థించడాన్ని బీజేపీ మహిళా మోర్చా వ్యతిరేకించింది. వైసీపీ ఇంకా తన వైఖరి మార్చుకోకుండా మహిళల గురించి ఇలాంటి వ్యాఖ్యలు చేసినవారిని ప్రోత్సహించడం దుర్మార్గమని బీజేపీ మహిళా మోర్చా ఓ ప్రకటనలో ఖండించింది. ఇదే విషయంపై సీపీఎం నేత వై.నేతాజీ అమరావతిని అసభ్యకరంగా దూషించడాన్ని ఓ ప్రకటన ద్వారా ఖండించారు. ఈ వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు.

కాంగ్రెస్ సీనియర్ మహిళా నేత పద్మశ్రీ ఫైర్

ఉంగుటూరు: రాజధాని అమరావతిపై జగన్ ద్వేషంతో రగిలిపోతూ విషం చిమ్ముతున్నారని, రాష్ట్ర అభివృద్ధికి రాజధాని ప్రాంతంలో భూములను త్యాగం చేసిన రైతులు, మహిళలను కించపరిచేలా సాక్షి బ్లూ మీడియాలో పేటీఎం జర్నలిస్ట్ చేసిన అసభ్యకరమైన వ్యాఖ్యలను పార్టీలకతీతంగా ఖండించాలని ఏపీ కాంగ్రెస్ సీనియర్ మహిళానేత సుంకర పద్మశ్రీ అన్నారు. బ్లూమీడియా సాక్షిగా అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కృష్ణంరాజును అరెస్ట్ చేయాలని, సాక్షి అధినేత భారతీరెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని పద్మశ్రీ డిమాండ్ చేశారు.

గొల్లపూడి వన్ సెంటర్లో జగన్ పత్రిక, దిష్టిబొమ్మ దహనం

గొల్లపూడి: అమరావతి రాజధాని మహిళలపై సాక్షి డిబెట్‌లో కృష్ణంరాజు అనే వ్యక్తి చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలపై గొల్లపూడిలో టీడీపీ శ్రేణులు భగ్గుమన్నాయి. ప్రజా రాజధాని అమరావతిపై సాక్షి పత్రిక, సాక్షి చానెల్ పని గట్టుకొని విష ప్రచారాన్ని చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ టీడీపీ శ్రేణులు గొల్లపూడి వన్ సెంటర్లో ఎన్టీఆర్ విగ్రహం ఎదుట శనివారం రాత్రి సాక్షి పత్రిక, సాక్షి దిష్టి బొమ్మను దహనం చేసి నిరసన హోరెత్తించారు. గొల్లపూడి ఏఎంసీ చైర్మన్ నర్రా వాసు, టీడీపీ గ్రామాధ్యక్షుడు నూతలపాటి వెంకటేశ్వరరావు (నారద) మాట్లాడుతూ సాక్షి డిబెట్‌లో జర్నలిస్టు ముసుగులో ఉన్న కృష్ణంరాజు అనే వ్యక్తి చేసిన వ్యాఖ్యలకు ప్రేరేపించి మాట్లాడించిన కొమ్మినేని శ్రీనివాసరావు తక్షణం క్షమాపణలు చెప్పాలన్నారు. టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు మాట్లాడుతూ రాజధానిపై తప్పుడు ప్రచారాలు చేసి శునకానందం పొందుతున్న వైసీపీ పార్టీవారిని నడిరోడ్డుపై తన్నాలని అప్పుడే ఆ పార్టీ నేతలకు, కార్యకర్తలకు బుద్ధి వస్తుందన్నారు. డౌన్ డౌన్ సాక్షి చానెల్, డౌన్ డౌన్ కొమ్మినేని శ్రీనివాసరావు, డౌన్ డౌన్ కృష్ణంరాజు అని పెద ్దపెట్టున నినాదాలు చేశారు. టీడీపీ నేతలు బొర్రా తిరుపతిరావు, చిట్టినేని క్రాంతి, చిట్టినేని క్రాంతి, బొర్రా చిన్నా, పొన్నం భీముడు పాల్గొన్నారు.

సాక్షి అధినేత కూడా అక్కడే ఉన్నారు: ఎమ్మెల్యే సౌమ్య



నందిగామ: అమరావతిని వైశ్యల రాజధాని అంటూ ప్రకటనలు చేసిన సాక్షి మీడియా ఆ సంస్థ అధినేత భారతీరెడ్డి కూడా అమరావతి పరిధిలోనే ఉందన్న విషయం గుర్తుంచుకోవాలని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య అన్నారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాజధాని అమరావతి పనులు శరవేగంగా సాగుతుంటే చూడలేని జగన్ మీడియా అవమానకర వ్యాఖ్యలు చేస్తుందన్నారు. రాజధాని మహిళలను అవమానకరంగా మాట్లాడిన ఘటనపై భారతీరెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశా రు. ఎన్ని కుట్రలు చేసినా అమరావతి నిర్మాణం ఆగదన్నారు. ప్రజల చీత్కారానికి గురై ప్రతిపక్ష హోదా కూడా కోల్పోయిన జగన్ ఇటువంటి చర్యలు కొనసాగిస్తే రాష్ట్రం నుండి సాగనంపుతారని అన్నారు.

భారతీ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలి: చెన్నుపాటి

వన్‌టౌన్: రాజధాని అమరావతిపై ఆ ప్రాం త మహిళలను అవమానపరిచేలా ప్రచారం చేసిన సాక్షి మీడియా అధినేత్రి భారతిరెడ్డి మ హిళాలోకానికి బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని ఎన్టీఆర్ జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు చెన్నుపాటి ఉషారాణి డిమాండ్ చేశారు. సాక్షి చానల్‌లో కొమ్మినేని శ్రీనివాసరావు నిర్వహించిన డిబేట్‌లో ఎనలిస్టు వీవీఆర్ కృష్ణంరాజు రాజధాని మహిళలపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ శనివారం గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో చెన్నుపాటి ఉషారాణి పలువురు మహిళా నేలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. అధికారం కోల్పోయి ప్రతిపక్ష హోదా కూడా దక్కని జగన్ అక్కసుతో, ద్వేషంతో తన బ్లూ మీడియాతో కలిసి రాజధాని అమరావతిపై విషం చిమ్మించే ప్రయత్నం చేస్తున్నాడన్నారు. హోంమంత్రి వంగలపూడి అనిత, ఏపీ మహిళా కమిషన్ చైర్ పర్సన్ స్పందించి సుమోటుగా స్వీకరించి న్యాయం జరిగేలా తగిన చర్యలు తీ సుకోవాలని కోరారు. తెలుగు రాష్ట్ర మహిళా ఉ పాధ్యక్షురాలు షేక్ ఆషా, రాష్ట్ర తెలుగు మహి ళా కార్యదర్శి ఎం.రాజ్యలక్ష్మి, మహిళా నాయకురాళ్లు నాగమణి, సుకాసి సరిత, సి.హెచ్.మాధవి, వి.అరుణ, లక్ష్మి, సౌజన్య పాల్గొన్నారు.

కొమ్మినేని, కృష్ణంరాజుపై ఫిర్యాదు

గన్నవరం: రాజధాని అమరావతి ప్రాంత మహిళలను వేశ్యలుగా, సెక్స్ వర్కర్లుగా పేర్కొంటూ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ శనివారం ఎన్డీఏ కూటమి మహిళా నేతలు మండి పడ్డారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. అమరావతి పరిరక్షణ సమితి నేత, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ కంభంపాటి శిరీష మాట్లాడుతూ సాక్షి అనే బోగస్ చానల్‌లో కొమ్మినేని శ్రీనివాస్, కృష్ణంరాజు అనే వ్యక్తులు అమరావతి మహిళలపై జుగుప్సాకరంగా లైవ్ డిబేట్లో మాట్లాడారని, గత వైసీపీ పాలనలోనూ అమరావతిని నాశనం చేసేందుకు అభాండాలు మోపారని, ప్రజలు నమ్మకుండా బుద్ధి చెప్పారన్నారు. ఇందులో కుట్ర దాగి ఉందని, వెంటనే అమరావతి మహిళలకు భారతి రెడ్డి క్షమాపణ చెప్పాలన్నారు. తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయి కల్యాణి మాట్లాడుతూ అమరావతి ప్రాంత మహిళలను ఘోరంగా అవమానిస్తూ మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. భారతి రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశాడనే ఆరోపణలపై టీడీపీ కార్యకర్త కిరణ్ అనే వ్యక్తిని పార్టీ నుంచి సస్పెండ్ చేసి పోలీస్ కేసు పెట్టి, జైల్లో పెట్టామని పార్టీకి మహిళలపై ఉన్న గౌరవం అలాంటిదన్నారు. అనంతరం సాక్షి దినపత్రిక ప్రతులను దగ్ధం చేస్తూ, సాక్షి మీడియాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. శ్రీనివాసరావు, కృష్ణంరాజులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గన్నవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మేడేపల్లి రమా, కానూరు శేషు మాధవి, మేకల స్వాతి, నెక్కంటి శ్రీదేవి, బొమ్మసాని అరుణ కుమారి, స్వర్ణ కుమారి, తుపాకుల శివలీల, బడుగు ఝాన్సీ, రమ్య, నాగమణి, యశోద, లావణ్య, చేబత్తిన సుజాత, లక్ష్మి, బి.సుకన్య పాల్గొన్నారు.

మాజీ ఎంపీ అంకినీడుకు ప్రముఖుల నివాళి

● ప్రజల సందర్శనార్థం చల్లపల్లి పురవీధుల్లో ఊరేగింపు ● కడసారి వీక్షించేందుకు రోడ్ల వెంబడి బారులుతీరిన ప్రజలుల

చల్లపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): చల్లపల్లి రాజా తనయుడు, బందరు మాజీ ఎంపీ శ్రీమంతు రాజా యార్లగడ్డ అంకినీడుప్రసాద్ బహద్దూర్‌కు ప్రముఖులు, ప్రజలు ఘన నివాళులర్పించారు. కోయంబత్తూరులో కన్నుమూసిన అంకినీడుప్రసాద్ భౌతికకాయాన్ని శనివారం సాయంత్రానికి స్వగ్రామమైన చల్లపల్లి తీసుకువచ్చారు. భౌతికకాయాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి ప్రజల సందర్శనార్థం చల్లపల్లి పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆటోనగర్ వద్ద తరిగోపుల ప్రాంగణం నుంచీ ప్రారంభమైన ఊరేగింపు ప్రధాన సెంటరు మీదుగా పడమరవీధి, చల్లపల్లి రాజా కోట, బ్రహ్మంగారి దేవాలయం వరకు సాగి తిరిగి ప్రధాన సెంటరు మీదుగా చల్లపల్లి రాజా హైస్కూల్‌కు చేరింది. ప్రజలు నివాళులర్పించేందుకు వీలుగా భౌతికకాయాన్ని హైస్కూల్ ప్రాంగణంలో ఉంచారు. అంకినీడు ప్రసాద్ కుమారులు రామేశ్వరప్రసాద్, హరీశ్వరప్రసాద్‌ను పరామర్శించారు.

ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావ్, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, టీడీపీ రాష్ట్రనేత కొనకళ్ల బుల్లయ్య, యువనేత మండలి వెంకట్రామ్,



మాజీ ఎంపీ యార్లగడ్డ అంకినీడు ప్రసాద్ భౌతికకాయం వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

ఆయుష్ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ యార్లగడ్డ రమేష్‌బాబు, మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్, డీఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, మోర్ల రాంబాబు, ముమ్మనేని నాని, ప్రముకులు సజ్జా చలపతిరావు, యార్లగడ్డ లంకబాబు, యార్లగడ్డ శ్రీనివారావు, గొర్రెపాటి వెంకట రామకృష్ణ, నూకల లక్ష్మయ్య, యార్లగడ్డ శివప్రసాద్, నాగళ్ల భీమారావు, మూల్పూరి లక్ష్మణస్వామి, వేమూరి రమేష్ బాబు, రావి చిట్టి, మోర్ల ప్రసాద్, తాతినేని పూర్ణ, పరుచూరి అంజయ్య, మిక్కిలినేని మధు, మోపిదేవి ద్వారకానాథ్, బొందలపాటి వీరబాబు, ఆది రామ్మోహనరావు, మీర్ రిజ్వాన్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు. చల్లపల్లి రాజా కుమారుడిని కడసారి చూసేందుకు ప్రజలు రోడ్డవెంబడి బారులుతీరారు. అంకినీడు ప్రసాద్ మృతికి సంతాప సూచకంగా కోట గోడ వెంబడి దుకాణదారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేశారు. సీఐ కే ఈశ్వరరావు, ఎస్ఐ పీఎస్‌వీ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బందోబస్తు చేపట్టారు.

ప్రభుత్వ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

మాజీ ఎంపీ యార్లగడ్డ అంకినీడుప్రసాద్ బహద్దూర్ అంత్యక్రియలు ప్రభుత్వ అధికార లాంఛనాలతో జరుగుతాయని ప్రభుత్వ విప్, గన్నవరం శాసనసభ్యుడు యార్లగడ్డ వెంకట్రావ్ తెలిపారు. చల్లపల్లి రాజా హైస్కూల్‌లో అంకినీడుప్రసాద్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ అంత్యక్రియల విషయమై సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌తో మాట్లాడినట్టు తెలిపారు. ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించేందుకు ఆదేశాలిచ్చారన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ ఆదివారం మధ్యాహ్నం శివగంగలో అంకినీడుప్రసాద్ అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ అంకినీడుప్రసాద్ మృతితో అవనిగడ్డ నియోజకవర్గం పెద్దదిక్కును కోల్పోయినట్లయిందని ఆవేదన వ్యక్తం చేశారు. చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల అభివృద్ధికీ, రాజా హైస్కూల్ ద్వారా పేదల విద్యాభివృద్ధికి ఎంతగానో కృషిచేశారని ఎంపీ వల్లభనేని బాలసౌరి ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.

యోగాభ్యాసంతో మానసిక వికాసం: కలెక్టర్



సత్యనారాయణపురం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): యోగాభ్యాసంతో మానసిక వికాసం కలుగుతుందని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. బీఆర్‌టీఎస్‌రోడ్డు యోగా స్ట్రీట్‌లో జిల్లా అధికారులు, వీఎంసీ, శనివారం థీమ్ యోగా జరిగింది. కలెక్టర్ వలంటీర్లు, నర్సింగ్ సిబ్బంది, ల్యాబ్ టెక్నిషియన్స్‌తో కలిసి యోగాసనాలు వేశారు. భారత వారసత్వ సంపదయిన యోగాను అన్ని వర్గాల వారికి చేరువ చేసుకొనేందుకు కృషి చేస్తున్నామన్నారు వీఎంసీ అదనపు కమిషనర్ డీ చంద్రశేఖర్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం సుహాసిని, వైద్యసేవ జిల్లా సమన్వయకర్త డాక్టర్ జే సుమన్, ఆయుష్ అధికారులు డాక్టర్ వీ రాణి, రామత్లెహి, డాక్టర్ కొల్టేఇ రమేష్, డాక్టర్ రత్న ప్రియదర్శిని లాయర్ల, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఎన్టీటీపీఎస్‌ను సందర్శించిన ఏపీఎస్‌పీఎఫ్ డీజీ



గౌరవవందనం స్వీకరిస్తున్న ఏపీఎస్‌పీఎఫ్ డీజీ సీఎం త్రివిక్రమ వర్మ

ఇబ్రహీంపట్నం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్‌పీఎఫ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ త్రివిక్రమ వర్మ (ఐపీఎస్) శనివారం డాక్టర్ ఎన్టీటీపీఎస్‌ను కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. తొలుత ఆయన ఏపీఎస్‌పీఎఫ్ నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ప్లాంట్‌లోని స్టేజ్-1 నుంచి స్టేజ్-4 క్లోల్డ్ ప్లాంట్, వ్యాగన్ త్రీ ఫ్లోర్ గురించి ఆయనకు ఏడీఈ హేమానంద్ వివరించారు. ఏపీ జెన్కో ఫ్యాక్టరీ మేనేజర్ శేషాద్రిశేఖర్, డీఎఫ్‌వో బీఎల్‌పీ శాస్త్రి కోల్ అన్‌లోడింగ్ అయ్యే బెల్ట్ మీదకు వెళ్లే విధానం, బోయిలర్ మెయింటెనెన్స్ గురించి వివరించారు. ఎస్ఈ అనురాధ కోల్ ద్వారా విద్యుత్ ఎలా తయారవుతుందో యూనిట్ కంట్రోల్ బోర్డులో వివరించారు. ఏపీఎస్‌పీఎఫ్ విజయవాడ జోన్ కమాండెంట్ ముద్దాడ శంకరరావు, అసిస్టెంట్ కమాండెంట్ టి.కృష్ణమాచారి పాల్గొన్నారు.

అమరావతిని కార్పొరేట్ రాజధానిగా మార్చొద్దు

● రాజధానిపై జరిగిన సదస్సులో వక్తలు



సదస్సులో ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ రామచంద్రయ్య

గవర్నర్‌పేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణం ప్రజా రాజధానిగా, పేద ప్రజలు నివసించే ఒక నగరంగా అభివృద్ధి చేయాలని కార్పొరేట్ రాజధానిగా మార్చడం సరైందని కాదని వక్తలు పేర్కొన్నారు. ఎంబీవీకే ఆధ్వర్యంలో శనివారం ఎంజీ రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబీవీకే)లో అమరావతి రాజధాని నిధులు-నిర్మాణం విధానాలు అనే అంశంపై సదస్సు జరిగింది. అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం బాధ్యుడు బీ గంగారావు అధ్యక్షత వహించారు. సెస్సు మాజీ ప్రొఫెసర్ డాక్టర్ సీ రామచంద్రయ్య మాట్లాడుతూ అమరావతిని మార్కెట్‌పై ఆధారపడే కార్పొరేట్ రాజధానిగా మార్చారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ సేవలను కార్పొరేట్ కంపెనీల ద్వారా చేస్తారన్నారు. రాష్ట్రానికి కావాల్సింది ఆగ్రో ప్రాసెసింగ్ పరిశ్రమ అని దానిపై దృష్టి పెట్టకుండా ఎయిర్‌పోర్టులు, రైల్వేస్టేషన్లు, క్రీడా ప్రాంగణాలకు వేలాది ఎకరాలు కార్పొరేట్ కంపెనీలకు ఉచితంగా కట్టబెట్టడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వాన్ని నమ్మి ఏ ఒక్క రైతు భూములిచ్చి మోసపోవద్దన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ఎంబీవీకే ట్రస్ట్ చైర్మన్ పి.మధు, న్యూడెమోక్రసీ నేత కే పోలారి. ఎంబీవీకే బాధ్యుడు టీ క్రాంతికిరణ్ పాల్గొన్నారు.

పర్యాటక శాఖ అభివృద్ధికి కృషి చేస్తున్నాం

మంత్రులు కొల్లు, నారాయణ, సారథి

మచిలీపట్నం టౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం బీచ్‌కు జాతీయ స్థాయిలో అన్ని హంగులతో ఆర్థికంగా బలపడేలా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. శనివారం మంగినపూడి బీచ్‌లో జరుగుతున్న బీచ్ ఫెస్టివల్ వేదికపై మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడారు. సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్ అభివృద్ధికి చిత్తశుద్ధితో ముందుకు వస్తున్నారన్నారు. కనివినీ ఎరుగని జాతీయ స్థాయిలో జలక్రీడలు, కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించడం ఒక రికార్డు స్థాపించామన్నారు. భవిష్యత్తులో మచిలీపట్నంలో సైనిక్ స్కూల్ స్థాపిస్తామన్నారు. బీచ్‌లో ఏవిధమైన ప్రమాదాలు జరగకుండా డ్రోన్ కెమెరాలతో అలారం సిస్టం ఏర్పాటు చేస్తామన్నారు. మునిసిపల్ శాఖా మంత్రి నారాయణ మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు ప్రతి సమావేశంలోనూ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడేలా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని సూచిస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రూ.10లక్షల కోట్లు అప్పులు చేసి వెళ్లారని, ఆ ఆర్థిక మాంద్యాన్ని నెట్టుకొచ్చేందుకు పర్యాటక రంగానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ జీడీపీలో ముందుకు వెళ్లే అవకాశాలున్నాయన్నారు. హౌసింగ్, సమాచార శాఖ మంత్రి కేపీ సారథి మాట్లాడుతూ, యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఇప్పటికి ఆరు పోర్టుల అభివృద్ధి జరుగుతుందని, మరో 6 పోర్టుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వ సాయంతో పోర్టుల అభివృద్ధిని ఒక యజ్ఞంలా తీసుకుంటున్నామన్నారు. 20 సూత్రాల అమలు చైర్మన్ లంకా దినకర్, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్, సినీదర్శకుడు మారుతి, మరో సినీదర్శకుడు నాగరమేష్, బెంగుళూరు స్వామిజీ బాలకృష్ణ, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, టీడీపీ నాయకులు గోపు సత్యనారాయణ, లోగిశెట్టి వెంకటస్వామి, రామధాని వేణు, తలారి సోమశేఖర్ పాల్గొన్నారు. చివరిగా మంత్రులు కొల్లు, నారాయణ, సారథి పారా గ్లైడింగ్ చేశారు.



మాట్లాడుతున్న మంత్రులు, కొల్లు, నారాయణ, సారథి తదితరులు



నల్లూరి కల్యాణమండపం దేవదాయ శాఖ స్వాధీనం

● స్వామి ఆభరణాలు కూడా.. ● ఆలయం ఇది వరకే స్వాధీనం
● హైకోర్టు తీర్పు వస్తే ఎస్ఎస్ఎం స్కూల్ కూడా..

ఆంధ్రజ్యోతి, విజయవాడ: నల్లూరి ట్రస్ట్ ఆధీనంలోని పటమటలోని కల్యాణమండపాన్ని దేవదాయశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. హైకోర్టు తీర్పు దేవదాయశాఖకు అనుకూలంగా రావటంతో చట్టబద్ధమైన చర్యలతో కల్యాణమండపాన్ని స్వాధీనంలోకి తీసుకున్నారు. దీంతో దాదాపుగా వందేళ్లుగా నల్లూరి వంశీకుల ఆధీనంలోని భూములు, భవనాలను దేవదాయ శాఖ స్వాధీనం చేసుకున్నట్టయింది. స్వామి వారి దేవస్థానాన్ని గతంలోనే స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం స్వాధీనం చేసుకున్న వాటిని పర్యవేక్షించేందుకు వన్‌టౌన్‌లోని విజయేశ్వరస్వామి ఆలయ ఈవోగా పనిచేస్తున్న కందుల వెంకటరెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో దేవస్థాన ఆస్తులను మదింపు చేపట్టారు. స్వామి బంగారు, వెండి ఆభరణాలను లెక్కించి రికార్డుల్లో నమోదు చేసి స్వాధీనం చేసకున్నారు. అలాగడే హుండీలకు కూడా తాళాలు వేశారు. కల్యాణమండపంతో పాటు గుడికి చెందిన ఆస్తులు, భూములన్నీ దేవదాయశాఖ పరమయ్యాయి.



స్వామి బంగారు ఆభరణాలను లెక్కిస్తున్న దేవదాయ సిబ్బంది

స్వచ్ఛ చల్లపల్లిని సందర్శించిన ముక్త్యాల బృందం

చల్లపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ చల్లపల్లిలో స్ఫూర్తిమంతంగా సాగుతున్న స్వచ్ఛ ఉద్యమాన్ని పరిశీలించేందుకు ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం ముక్త్యాల గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, పెద్దల బృందం 35 మంది శనివారం చల్లపల్లి వచ్చారు. కేసీపీ సీఎస్ఆర్ మేనేజర్ రాఘవేంద్రరావు ద్వారా స్వచ్ఛ చల్లపల్లి ఖ్యాతిని తెలుసుకున్న బృందం మేనేజర్‌తో కలిసి చల్లపల్లి సందర్శించారు. 3495వ రోజు స్వచ్ఛ సేవలో పాల్గొని కార్యకర్తలతో కలిసి శ్రమదానం చేశారు. ఈ ఉద్యమ ప్రస్థానాన్ని స్వచ్ఛ చల్లపల్లి సారథులు డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్, డాక్టర్ పద్మావతి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తెలిపారు. అనంతరం బృంద సభ్యులు మాట్లాడుతూ స్వచ్ఛ ముక్త్యాల చేయాలని తమ కోరికనీ, అందుకు స్వచ్ఛ చల్లపల్లి ప్రేరణ ఇచ్చిందన్నారు. ముక్త్యాలను స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దుకుని స్వచ్ఛ చల్లపల్లి బృందాన్ని ఆహ్వానిస్తామన్నారు. ముక్త్యాల సర్పంచ్ షేక్ ఉమర్, కార్యదర్శి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్‌లు, వార్డుసభ్యులు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు. స్వచ్ఛ చల్లపల్లిలో భాగంగా పనులు చేస్తున్న మన కోసం మనం ట్రస్ట్‌కు ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ గోపాళం శివన్నారాయణ, విశ్రాంత ఉపాధ్యాయుడు ప్రాతూరి ఉదయశంకర శాస్త్రి రూ.5వేలు చొప్పున విరాళాన్ని ట్రస్టీ డీఆర్‌కే ప్రసాద్‌కు అందజేశారు.



స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తలతో ముక్త్యాల బృందం

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244



నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 540

గోవుల స్వాధీనం.. గోశాలకు తరలింపు



గుడ్లవల్లేరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలించేందుకు దాచి పెట్టిన 22 ఆవులను గుడ్లవల్లేరు పోలీసులు శుక్రవారం రాత్రి అదుపులోకి తీసుకొని వాటిని శనివారం గోశాలకు తరలించినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. వడ్లమన్నాడు గ్రామ శివార్లలో కొందరు 22 ఆవులు, దూడలను దాచి ఉంచి కబేళాలకు తరలించనున్నారని సమాచారం రావడంతో హుటాహుటిన ఆ ప్రాంతానికి వెళ్లి వాటిని అదుపులోకి తీసుకొని సంరక్షణ నిమిత్తం మొవ్వ మండలం పెదముత్తేవి గోశాలకు తరలించామన్నారు.



కూచిపూడిలో ఉపాధి కూలీల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా

సమస్యల పరిష్కారానికి కృషి: వర్ల

కూచిపూడి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : కూచిపూడి, పెదపూడి ప్రజలు తన దృష్టికి తెచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా హామీ ఇచ్చారు. శనివారం ఆయన మొవ్వ మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. బార్లపూడి రహదారిలో రోడ్ల పక్కన నివాసం ఉంటున్న చెంచులు నివేశనాస్థలాలు మంజూరు చేయాలని, చేపలు అమ్ముకునేందుకు మార్కెట్ సౌకర్యం కల్పించాలని కోరారు. మౌలిక వసతులు కల్పించాలని పెదపూడి జగనన్న కాలనీ వాసులు విజ్ఞప్తి చేశారు. ఉపాధి కూలీలు పని చేస్తున్న ప్రదేశానికి వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కూచిపూడిలోని కోనేరు పబ్లిక్ స్కూల్ రహదారిలో పంట కాలువ పూడికతీత పనులు చేపట్టాల్సిందిగా రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు లింగమనేని రామలింగేశ్వరరావు, వీరంకి తులసీ దాస్, వెంపటి గోపాల కృష్ణ, తాతా ప్రభాకర్‌రావు, తాతా శివాజీ తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

సేవా దృక్పథంతో వైద్యం అందించాలి

గుడివాడ, జూన్ 7(ఆంధ్రజ్యోతి) : సేవా దృక్పథంతో ప్రజలకు వైద్య సేవలందించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఏరియా ప్రభుత్వాసుపత్రిని శనివారం ఆయన సందర్శించి వివిధ విభాగాలను తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ప్రధాన విభాగాల రికార్డులను పరిశీలించారు. చికిత్స పొందుతున్న రోగులు, కుటుంబసభ్యులతో మాట్లాడారు. ఆసుపత్రిలో కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. టెక్నీషియన్లు, ఇతర సిబ్బంది కొరత వివరాలను తన దృష్టికి తీసుకువస్తే ఉన్నతాధికారుల మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానన్నారు. అటెండెన్స్ రిజిష్టర్‌లో కొందరు ఉద్యోగులసంతకాలు లేకపోవడాన్ని గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యానికి తావు లేకుండా ఆసుపత్రిల్లో వైద్యులు, సిబ్బంది ప్రజలకు సేవలందించాలని, సమస్యలు తలెత్తితే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ గుడివాడ జోన్స్, సభ్యులు చాగంటిపాటి దేవేంద్రుడు, నాగరాజు, ఆర్ఎంవో కృష్ణదొర తదితరులు పాల్గొన్నారు.

వడగాల్పులతో అల్లాడిపోయిన జనం

గుడివాడ రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో వడగాల్పులకు ప్రజలు శనివారం ప్రజలు అల్లాడిపోయారు. సాయంత్రం 6 గంటల వరకు 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వివాహాలు, శుభ కార్యాలు ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. నాలుగు రోజులుగా ఉదయం 10 గంటలకే రహదారులు నిర్మానుష్యంగా ఉంటున్నాయి. వృద్ధులు ఎండవేడిమికి తట్టుకోలేకపోయారు. మోటూరు వైద్యశాల అధికారిణి డాక్టర్ దీప్తి మాట్లాడుతూ ఎండల నేపథ్యంలో ఉదయం పూట ఇంటి వద్దే ఉండాలని సూచించారు. ఎక్కువగా మజ్జిగ, చల్లటి పదార్థాలు తీసుకోవాలని కోరారు. వడదెబ్బ తగిలినట్లు అనిపిస్తే దగ్గరలోని వైద్య సిబ్బందిని వెంటనే సంప్రదించాలన్నారు. అత్యవసర వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు అందుబాటులో ఉంటారని ఆమె తెలిపారు.

జీసస్ ఇంగ్లీషు మీడియం స్కూల్
విద్యార్థులకు ప్రతిభా అవార్డులు

పమిడిముక్కల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : వీరంకిలాకు జీసస్ ఇంగ్లీషుమీడియం స్కూల్ విద్యార్థులు ఆరుగురు ప్రభుత్వ ప్రతిభా అవార్డులకు ఎంపికయ్యారు. ప్రభుత్వం కేటాయించిన రిజర్వేషన్ ప్రకారం విద్యార్థులను ఎంపిక చేసినట్టు స్కూల్ ప్రిన్సిపాల్ జి.తారాలీల తెలిపారు. జీసస్ ఇంగ్లీషు మీడియం స్కూల్ నుంచి జి.దుర్గాప్రసాద్, మేడా వెంకటకౌశిక్, జువారియా ఫిర్‌దౌస్, కె.యామిని, ఎం.చరితశ్రీ, పి.వినీత, మర్రివాడ ఎంకె ఇంగ్లీషు మీడియం స్కూల్ నుంచి శ్రీరాం శిరీష అవార్డులకు ఎన్నికయ్యారు. విద్యార్థులను .జీసస్ స్కూల్ ప్రిన్సిపాల్ తారాలీల, ఎంకె ఇంగ్లీషుమీడియం స్కూల్ డైరెక్టర్ ఎంకె బాబు అభినందించారు.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్సై సీహెచ్ అవినాష్

జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

తోట్లవల్లూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరులో ప్రీమియర్ లీగ్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ఎస్సై సీహెచ్ అవినాష్ శనివారం ప్రారంభించారు. కనకదుర్గమ్మకాలనీ వద్ద పొలాల్లో ఈ పోటీలను ఏర్పాటు చేశారు. నిర్వాహకులు ప్రశాంత్, నవీన్, మధు తదితరులు పోటీలను పర్యవేక్షిస్తున్నారు.

జన్మభూమి మెడికల్ సెంటర్‌లో వైద్యశిబిరం



మహిళకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ సీఎల్ వెంకట్రావు

గుడ్లవల్లేరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సి.ఎల్. వెంకట్రావు ఆధ్వర్యంలో శనివారం గుడ్లవల్లేరులోని జన్మభూమి మెడికల్ సెంటర్‌లో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సాధారణ రోగులకు, గ్యాస్ట్రిక్ సమస్యలకు డాక్టర్ వెంకట్రావు పరీక్షలు నిర్వహించారు. ఏలూరు డెంటల్ కళాశాల వైద్యులచే దంత వైద్య పరీక్షలు, విజయవాడ పి.వి.ఆర్ హాస్పటల్ వైద్యులచే హృద్రోగ వైద్య పరీక్షలు నిర్వహించారు.



గుడివాడ పట్టణంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు.. పామర్రు మసీదులో.. తొట్లవల్లూరులో

త్యాగానికి ప్రతీక బక్రీద్

గుడివాడ, జూన్ 7(ఆంధ్రజ్యోతి) : గుడివాడ పట్టణంలో బక్రీద్ పండుగను శనివారం ఘనంగా నిర్వహించారు. మియాఖాన్ మసీదు, గుల్జార్‌చౌక్, షాహీ, నూర్ తదితర మసీదుల్లో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. మతగురువులు ఖురాన్ సందేశాన్ని ఇచ్చారు. త్యాగానికి, భక్తికి, సేవలకు బక్రీద్ ప్రతిరూపమని మతగురువులు పేర్కొన్నారు. ప్రార్థనల అనంతరర ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముస్లింలు తమ శక్తి కొలది మంసాన్ని నిరుపేదలకు పంచిపెట్టారు.

● బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ప్రజావేదికలో ఆయన మాట్లాడుతూ త్యాగం, సహనం బక్రీద్ పండుగ సందేశమన్నారు. దైవప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ పండుగను ఘనంగా నిర్వహించుకుంటారన్నారు. సమిష్టి ప్రయోజనాల కోసం వ్యక్తిగత స్వార్థాన్ని వీడాలని, త్యాగాలకు సిద్ధపడినప్పుడే సమాజహితం సాధ్యమవుతుందన్నారు. ప్రాప్తించిన ప్రయోజనాలు సమస్త జనులకు సమానంగా అందినప్పుడే త్యాగాలకు సార్థకత అని బక్రీద్ సందేశమని ఎమ్మెల్యే వెనిగండ్ల పేర్కొన్నారు.

పమిడిముక్కల: అలీనఖీపాలెంలో శనివారం హుస్సేనీలో మౌలానా మీర్జా ఇబ్రహీం అలీ ఇస్ఫహానీ నేతృత్వంలో బక్రీద్ పండుగను భక్తి ప్రపత్తులతో జరుపుకున్నారు మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పరస్పరం బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. త్యాగం, అనురాగం, దాన గుణాలను పెంపొందించే పండుగ బక్రీద్ అని పేర్కొంటూ ముస్లింలకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ప్రవక్త ఇబ్ర హీం త్యాగనిరతిని స్మరించుకున్నారు.

పెదపారుపూడి : వెంట్రప్రగడ మసీదులో బక్రీదు పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థలు చేశారు. త్యాగానికి ప్రతీకగా పండుగను ముస్లింలు జరుపుకున్నారు. మత గురువులు పండుగ విశిష్టతను వివరించారు.



శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లింలు

తోట్లవల్లూరు : తోట్లవల్లూరులో శనివారం ముస్లింలు బక్రీద్ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మెయిన్ సెంటర్‌లోని అంజుమన్ బిల్డింగ్‌పై వేసిన షామియానాలో మతగురువు హసన్ అహ్మద్ ఆధ్వర్యంలో బక్రీద్ వేడుక నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు జరిపి బక్రీద్ సందేశాన్ని హసన్ అహ్మద్ వివరించారు. అనంతరం ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

పామర్రు : త్యాగాలకు ప్రతీకగా బక్రీద్ వేడుకను ముస్లింలు పామర్రులో భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మతపెద్ద అబ్దుల్ ఉమ్రీయునస్ మాట్లాడుతూ, మానవునిలో ప్రతికూల శక్తులు నశించి, సానుకూల దృక్పథం అలవడేందుకు బక్రీద్‌ను నిర్వహిస్తామన్నారు. మండల పరిధిలోని పెదమద్దాలి, సప్తార్‌ఖాన్‌పాలెం, నిభానుపూడి గ్రామాల్లోని మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ముస్లింలకు ఎమ్మెల్యే వర్లకూమార్‌ంాజా బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు.

గుడ్లవలేరు : మండలంలో బక్రీద్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కౌతవరం మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వేమవరం, గుడ్లవల్లేరు, కట్టానిచెరువు, శేరీదగ్గుమిల్లి, పెంజంద్ర, సుబ్బిచెరువు మసీదుల్లో బక్రీద్ ప్రార్థనలు చేశారు.



అలీనఖీపాలెంలో.. కౌతవరం మసీదులో

అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలకు
తెలుగు మహిళా నేతల ఆగ్రహం



మాట్లాడుతున్న మహిళా నేతలు

పామర్రు, జూన్ 7 : (ఆంధ్రజ్యోతి) : డిబేట్‌లో రాజధాని అమరావతి విషయంలో మహిళలను మానసిక క్షోభకు గురి చేసే విధంగా వాఖ్యలు చేసిన వ్యక్తులు తక్షణమే క్షమాపణ చెప్పాలని తెలుగు మహిళ నేత ఘైనేని ఇందిర డిమాండ్ చేశారు. పామర్రు టీడీపీ కార్యాలయంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. అమరావతి ఔన్నత్యాన్ని దెబ్బతీసే విధంగా, మహిళలను కించే పరిచే విధంగా వాఖ్యలు చేయడం సరికాదన్నారు. మహిళల గౌరవానికి భంగం వాటిల్లే రీతిలో నీచంగా మాట్లాడిన వారిపై సుమోటోగా కేసు నమోదు చేసి చట్టప్రకారం కఠిన చర్యలు తీసు కో వాలన్నారు. ఈ సమావేశంలో గుత్తికొండ పద్మ, ఆరుమళ్ల అనిత, చాట్ల పున్నమ్మ, చలసాని దివ్య, సరోజని తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ వైద్యులు డాక్టర్ పాలడుగు

గుడివాడ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : పాటి మీద వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారి వార్షిక బ్రహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం యాగశాల ప్రవేశం, కుంభారాధన, అగ్ని ప్రతిష్ఠా హోమం, ధ్వజారోహణ జరిగాయి. సంతానం లేని దంపతులకు గరుడ ముద్ద ప్రసాదంగా అందజేశారు. పూలంగి సేవ దాతలుగా విజయ సాయి ఆసుపత్రి అధినేత చాగంటిపాడు రాజ్‌కుమార్, పెదపారుపూడి రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ సనకా శ్రీనివాస్, అన్నపూర్ణ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి అధినేత డాక్టర్ పాలడుగు వెంకట్రావు వ్యవహరించారని ఈవో కందుల వేణుగోపాలరావు తెలిపారు. దాతలను ఘనంగా సత్కరించి స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు.

స్మార్ట్‌మీటర్లు బిగించొద్దు..



గుడివాడ, జూన్ 7(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం, అదానీతో కుమ్మక్కై ఇళ్లకు దౌర్జన్యంగా బిగిస్తున్న స్మార్ట్‌మీటర్‌లను వెంటనే ఆపాలని టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ కార్యదర్శి బసవ అరుణ డిమాండ్ చేశారు. శ్రీకాళహస్తికాలనీలో అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వద్దంటున్నా ఇళ్లకు దౌర్జన్యంగా స్మార్ట్ మీటర్లు బిగిస్తే ఊరుకోమని హెచ్చరించారు. టిడ్కో కాలనీ, శ్రీకాళహస్తి కాలనీ, మందపాడు న్యూకాలనీల్లో స్మార్ట్ మీటరు బిగించడాన్ని ఒప్పుకునేది లేదన్నారు. శ్రీకాళహస్తి కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బి.వి రమణ, ఉత్తర లక్ష్మీ మాట్లాడుతూ రేషన్ బియ్యానికి నగదు బదిలీ ఆపాలన్నారు. ఉద్యమ నాయకుడు బి.వి. శ్రీనివాసరావుపై పోలీసులు వేధింపులను ఆపాలన్నారు. శ్రీకాళహస్తి కాలనీఅభివృద్ధి కమిటీ సభ్యులు మరియమ్మ, కుమారి, నాగమణి, విజయలక్ష్మీ, సురేష్, గౌరీనాయుడు, మేరీ, బేబీ, మంగతాయారు, సింహాచలం, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

వెబ్ కౌన్సెలింగ్‌ను నిరసిస్తూ ఉపాధ్యాయ సంఘాల ధర్నా

గుడివాడ రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : మాన్యువల్‌గా బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరుతూ శనివారం మధ్యాహ్నం ఉపాధ్యాయులు ఎంఈవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. వెబ్ కౌన్సెలింగ్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. పీఆర్టీయూ, యూటీఎఫ్ తదితర యూనియన్ నాయకులు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : ఐక్య ఉపాధ్యాయ వేదిక ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు శనివారం ధర్నా నిర్వహించారు. బదిలీల వెబ్‌కౌన్సిలింగ్‌ను ఉపాధ్యాయులు బహిష్కరించినందున, మండల కేంద్రాలలో కంప్యూటర్లు ఏర్పాటు చేసి ఉపాధ్యాయులను కార్యాలయాలకు పిలిపించి వెబ్ ఆప్షన్ పెట్టాలని వత్తిడి తేవడాన్ని వ్యతిరేకిస్తూ ఉపాధ్యాయులు ధర్నాకు దిగారు. డీఈవో కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూటీఎఫ్ కార్యదర్శి ఏ.వి. వరలక్ష్మి, సంఘం అధ్యక్షులు ఎం.ఆరోగ్యం, ప్రధాన కార్యదర్శి హరి శ్రీనివాస్, ఏపీటీఎఫ్ నాయకులు డి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎంఈవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు.. గుడ్లవల్లేరు మండల కార్యాలయం వద్ద..

అగ్ని బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కూచిపూడి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : కూచిపూడిలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో కోమటిగుంట బ్రహ్మయ్యకు చెందిన గృహం అగ్నికి ఆహుతి కాగా పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయమందించారు. పక్కా గృహాల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. లింగమనేని రామలింగేశ్వరరావు, వీరంకి తులసీదాస్, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో మహిళ మృతి

గుడివాడ రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : చౌటపల్లి గ్రామానికి చెందిన కొసనం సుభద్ర పాముకాటుకు గురై మరణించినట్లు రూరల్ స్టేషన్ ఎస్సై చంటిబాబు శనివారం తెలిపారు. కొసనం సుభద్ర ఈ నెల 3వ తేదీ రాత్రి ఒంటి గంటకు బయటకు రాగా పాము కాటుకు గురైనట్లు తెలిపారు. ఆమెను మెరుగైన చికిత్స నిమిత్తం గుడివాడ ఏరియా ఆసుపత్రికి తరలించగా, శనివారం ఉదయం చికిత్స పొందుతూ మరణించింది. భర్త ఏసుదాసు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కేసు నమోదు చేశాం: ఎస్సై

నందివాడ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : పుట్టగుంట వైసీపీ సర్పంచ్ వేధింపుల విషయమై శనివారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి నందివాడ ఎస్సై శ్రీనివారావు స్పందించి వివరణ ఇచ్చారు. అప్పట్లో సంఘటనపై గొన్నూరు కాశీ విశ్వనాథ్ ప్రసాద్ రెడ్డి తనను కొట్టారంటూ లారీ డ్రైవర్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని, పుట్టగుంట సర్పంచ్ తెన్నేటి భాస్కర్ రెడ్డిపై గొన్నూరు కాశీవిశ్వనాథ్ ప్రసాద్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. కాశీ విశ్వనాథ్ పిటిషన్‌పై గ్రామంలో విచారించి ఆయనకు ఎఫ్ఐఆర్ ఇవ్వటం జరిగిందని ఎస్సై వివరణ ఇచ్చారు.

గరికపర్రు విద్యార్థినులకు మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్

తోట్లవల్లూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : గరికపర్రు హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థినులు నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించారని హెచ్ఎం శ్రీకృష్ణ శనివారం తెలిపారు. ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో ఎనిమిదో తరగతి విద్యార్థినులు నరేంద్ర యోగశ్రీ, వీరంకి పల్లవి ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. విద్యార్థులను, కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందిస్తున్నట్టు హెచ్ఎం శ్రీకృష్ణ తెలిపారు.

వృద్ధులకు చీరలు, పండ్లు పంపిణీ

గుడివాడ, జూన్ 7(ఆంధ్రజ్యోతి) : బైపాస్‌రోడ్డులోని మమత వృద్ధాశ్రమంలో శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం బత్తుల వీర రాఘవమ్మ నాల్గవ వర్ధంతి సందర్భంగా ఆమె కుమార్తె కంచర్ల సామ్రాజ్యం, కుమారుడు బత్తుల వెంకట ప్రసా ద్, సుధాకర్‌ల ఆర్థిక సహాయంతో వృద్ధులకు చీరలు, పండ్లు, భోజన వసతి కల్పించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టి హరికుమార్, సభ్యులు తాతారావు, అజయ్‌కుమార్, రామారావు, బాలాజీ, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 540

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



మోపిదేవి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి తిరుపతికి చెందిన వి.వి.ఎస్. శ్రీధర్ - విజయభాను దంపతులు తమ కుమార్తె హరిణి పేరు మీద రూ.1,00,001 విరాళంగా అందజేశారు. ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాద్‌కు విరాళం చెక్కును అందించగా, దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించారు.



సాంస్కృతిక ప్రదర్శనలను తిలకిస్తున్న మంత్రులు నారాయణ, పార్థసారథి, రవీంద్ర, ఉన్నతాధికారులు





గేట్ వే ఆఫ్ అమరావతి వద్ద పర్యాటకుల రద్దీ



భోజన ప్రియులతో కిటకిటలాడుతున్న ఫుడ్ స్టాళ్లు

జనసంద్రం



స్నానాలు చేసే వారితో జనసంద్రంగా కన్పిస్తున్న మంగినపూడి బీచ్

మచిలీపట్నం టౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : మసుల బీచ్ ఫెస్టివల్‌కు మూడోరోజు పర్యాటకులు పోటెత్తారు. పిల్లలు, పెద్దలు తరలి తండోపతండాలుగా తరలిరావడంతో మంగినపూడి బీచ్ జన సంద్రమైంది. ఉదయం, మధ్యాహ్నం పర్యాటకు సముద్ర స్నానం చేస్తూ కేరింతలు కొట్టిరు. సముద్రతీరంలో జనకెరటం ఎగసిపడింది. ఫుడ్ స్టాల్స్ పర్యాటకులతో కిటకిటలాడాయి. రాష్ట్రం నలుమూలాల నుంచి వచ్చిన ప్రత్యేక వంటకాలాన్ని ఫుడ్ స్టాల్స్‌కు చేరుకున్నాయి. బందరు లడ్డు, ఆత్రేయపురం పూతరేకులు, మాడుగుల హల్వ, కాకినాడ కాజా, రాజమండ్రి రోజ్‌మిల్క్, గోదావరి బిర్యానీ, నెల్లూరు చేపల పులుసు, హైదరబాద్ బిర్యానీలతో పాటు మరెన్నో రుచులు యాత్రికులను కట్టిపడేస్తున్నాయి. సాంస్కృతిక ప్రదర్శనలు తిలకించేందుకు వేలాదిగా తరలివచ్చారు. నాటక ప్రదర్శనలు, జబర్దస్త్ కళాకారుల స్కిట్స్ ప్రజలను అలరించాయి. మంత్రులు నారాయణ, పార్థసారథి, రవీంద్ర, ఉన్నతాధికారులు రాత్రి వరకు ఉండి సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించారు. మంగినపూడి బీచ్‌లో వివిధ పోటీల్లో దాదాపు 2000 మంది క్రీడాకా రులు పాల్గొంటున్నారు. వాలీబాల్, కబడ్డీ, కయాకింగ్ పోటీల్లో గాయపడిన క్రీడాకారులకు వైద్య సేవలందించారు. జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ తలారి సోమశేఖరరావు, మాజీ డైరెక్టర్ బోయిన రాజు తదితరులు పర్యవేక్షించారు. శిబిరాన్ని మంత్రి కొల్లు రవీంద్ర సందర్శించి అభినందించారు. ఎచ్చుబొట్లు వేయిం చుకునేందుకు యువతీ యువకులు ఆసక్తి చూపడం గమనార్హం.

వైసీపీ నేతల విమర్శలు అర్ధరహితం : గోపీచంద్

మచిలీపట్నం టౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : మసులా బీచ్ ఫెస్టివల్‌ను మచిలీపట్నంలో మంత్రి కొల్లు రవీంద్ర ఘనంగా నిర్వహిస్తుంటే వాటిని చూసి వైసీపీ నేతలు ఓర్వలేక అవాకులు, చెవాకులు పేలడం వైసీపీ నేతల దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని టీడీపీ సీనియర్ నాయకుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ విమర్శించారు. బీచ్ ఫెస్టివల్‌లో పర్యాటలకు మజ్జిగ పంపిణీ చేశారు. గోపీచంద్ మాట్లాడుతూ, సుదూర ప్రాంతాల నుంచి ఎంతో మంది పర్యాటకు బీచ్ ఫెస్టివల్‌కు తరలివచ్చి ఆనందంగా గడుపుతున్నారన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర మచిలీపట్నం బీచ్‌ను అభివృద్ధి చేయడం ద్వారా టూరిజం మన ప్రాంతంలో అభివృద్ధి చెంది ఆర్థికంగా, ఉపాధి వస్తుందని వైసీపీ నేతలు గ్రహించాలన్నారు. టీడీపీ ప్రచార కార్యదర్శి పి.వి. ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

కోడూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : కోడూరులో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి 29వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం రాత్రి ప్రముఖ పండితులు, ఉపన్యాసకులు మొవ్వ ఉషాద్రిపతి చేతులమీదుగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు స్వామివారిని దర్శించుకోవటానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. శనివారం వేంకటేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం రాత్రి 8.30 నిముషాలకు స్వామివారి కల్యాణ మహోత్సవం జరుగుతుందని ఆలయ ట్రస్టీ కోట పద్మావతి ప్రసాద్ తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకులు దుంపల శ్రీధరాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మొవ్వ ఉషాద్రిపతిని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.



మచిలీపట్నంలో ఈద్గా వద్ద బక్రీద్ ప్రార్థనల్లో పాల్గొన్న మంత్రి కొల్లు రవీంద్ర



పెడనలో ఈద్గా వద్ద జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

పెడన విద్యార్థినులకు ప్రతిభా అవార్డులు





పి.శ్రీలక్ష్మీసుమ నాగలలిత

పెడన, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విశ్వ భారతి హైస్కూల్‌కు చెందిన విద్యార్థినులు కేదారి శ్రీలక్ష్మీసుమ, ఉమ్మిటి నాగలలిత రాష్ట్ర ప్రభుత్వ ప్రతిభా అవార్డులకు ఎంపికయ్యారు. వీరికి ఈనెల 9న మచిలీపట్నంలో జరిగే జిల్లా స్థాయి కార్యక్రమంలో కలెక్టర్, మంత్రులు, జిల్లా విద్యాశాఖాధికారి చేతుల మీ దుగా రూ. 20 వేల నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందజేస్తారు. ప్రతిభా అవార్డులకు ఎంపికయిన లక్ష్మీసుమ, నాగలలితను విశ్వభారతి హైస్కూల్ ప్రిన్సిపాల్ అనుమకొండ గౌరీప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

మచిలీపట్నం టౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : అల్లాహ్ బోధించిన ప్రేమ, త్యాగం అందరికీ ఆదర్శమని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. శనివారం మంత్రి మచిలీపట్నం ఈద్గా వద్ద జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నాయకులు ఎండి ఇలియాస్ పాషా, ఖాజా, జనసేన నాయకుడు మాదివాడ రాము పాల్గొన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, ఈద్గా అభివృద్ధికి నిధులు మం జూరు చేస్తామన్నారు. **పెడన** : త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగను పట్టణంలో పెడనలో ఘనంగా జరుపుకున్నారు. గుడివాడ రోడ్డులోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. హజ్రత్ ఇబ్రహీం, ఆయన కుమారుడు ఇస్మాయిల్ త్యాగ నిరతిని స్మరించుకుంటూ వేలాది మంది ముస్లింలు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. మత గురువులు సయ్యద్ అహమ్మద్ మదనీ, మెహబూజి ఆలం సందేశం ఇచ్చారు. బక్రీద్ రోజున స్వార్థం, అసూయ, ద్వేషాలను త్యజించాలని, దుష్ట భావనలకు, దురాచారాలకు తర్పణం వదలాలని, సత్యం, ధర్మం కోసం పాటుపడాలని మత గురువులు ఉద్బోధించారు. సంపన్న ముస్లింలు పేద ముస్లింలకు ఖుర్బానీ దానం చేశారు. ఈద్గాల వద్ద జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ పాల్గొని బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. అబ్దుల్ ఖదీర్, మెహమూద్, హస్సు, ఇనుముల్లా, హమీదుల్లా, వహబ్‌ఖాన్, అబ్దుల్ గఫార్ తదితర ముస్లింలు పాల్గొన్నారు. **గూడూరు** : బక్రీద్‌ను గూడూరు, పరిసర గ్రామాల్లో శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గూ డూరు జామియా మస్జిద్‌లో హఫీజ్ మొహమ్మద్ షోయబ్ ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. తరకటూరు, పోల వరం, మల్లవోలు, ఆకులమన్నాడు, పినగూడూరులంక, షా అబ్దుల్లాపాలెం గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ పండుగ జరుపుకున్నారు. **బంటుమిల్లి** : బక్రీద్ సందర్భంగా బంటుమిల్లి ఈద్గా మైదానంలో ప్రార్థనలు జరిపారు. త్యాగానికి ప్రతిక బక్రీద్ అని మతగురువులు మౌలానా అబ్దుల్ వహెద్, అజీమ్ అన్నారు. ఈ ప్రార్థనలలో మస్జిద్ కమిటీ సభ్యులు ఎండి కమల్, ఎండీ నజీర్, అలీమ్,అక్బర్, బాబ్జీ, ఆదిల్, ముస్లీం సోదరులు తదితరులు పాల్గొన్నారు. **నాగాయలంక** : నాగాయలంకలో బక్రీద్ పండుగను ముస్లీం సోదరులు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక జామియా మసీదులో మత గురువు షేక్ సత్తార్ బక్రీద్ పర్వదినం సందర్భంగా




నాగాయలంక మసీదులో..




బంటుమిల్లి మసీదులో..

ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఖురాన్ పఠించి బక్రీద్ విశిష్టతను తెలిపారు. ఈ కార్యక్రమాలను షేక్ జానీ, రహంతుల్లా, అబ్దుల్లా, పఠాన్ సుభాని తదితరులు పాల్గొని పర్యవేక్షించారు. **ఘంటసాల** : హజ్రత్ ఇబ్రహీం త్యాగనిరతికి ప్రతీకగా బక్రీద్‌ను ముస్లింలు నిర్వహిస్తారని మత గురువు అబ్దుల్ గఫార్ అన్నారు.ఘోటకం-ఎ కాలనీలో జామియా సమీదులో బక్రీద్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత గురువు బక్రీద్ విశిష్టతను వివరించారు. మసీదు కమిటీ అధ్యక్షులు షేక్ బాషా, ముస్లీం సోదరులు పాల్గొన్నారు. **అవనిగడ్డ** : స్థానిక ఏడో వార్డులోని జామియా మసీదులో శనివారం భక్తిశ్రద్ధలతో బక్రీద్ ప్రార్థనలు నిర్వహించారు. ఎండి షాహిదా, అబ్దుల్ రహమాన్ షేక్ బాబావలి బక్రీద్ విశిష్టతను వివరించారు. ప్రార్థనల అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. త్యాగానానికి, భక్తికి బక్రీద్ ప్రతిరూమని మత గురువులు వివరించారు. **చల్లపల్లి** : చల్లపల్లిలో బక్రీద్ పర్వదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ముస్లింలు గ్రామంలోని మసీదుల వద్ద నుంచి నినాదాలు చేస్తూ ర్యాలీగా ఈద్గా మైదానానికి చేరుకున్నారు. ఖురాన్ గురువు సమక్షంలో ఈద్ ఉల్ అజా పర్వదినం సందర్భంగా ప్రత్యేక నమాజు చేశారు. ప్రపంచ శాంతి, పేదరిక నిర్మూలన కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకున్నారు. శ్మశానవాటికలో తమ పూర్వీకుల సమాధులకు పుష్పాలంకరణ చేసి నివాళులు అర్పించారు.



చల్లపల్లి ఈద్గాలో సందేశమిస్తున్న మతపెద్ద



ఘంటసాల ఘోటకం ఎ-కాలనీ మసీదులో..



సాయిబాబాకు విశేష పూజలు చేస్తున్న భక్తులు



ధర్మకర్త బాధ్యతలు స్వీకరిస్తున్న చక్రవర్తి

ఘనంగా సాయి మందిర 16వ వార్షికోత్సవం

నాగాయలంక, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : భావదేవరపల్లిలో షిర్డి సాయిబాబా మందిరం 16వ వార్షికోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది.

షిర్డిసాయిబాబాకు విశేష పూజలు చేశారు. వేదపండితులు ఆకెళ్ల దేవనాథన్ శర్మ బ్రహ్మత్వంలో హోమాన్ని నిర్వహించారు. తుటారం రాము విధుల నుంచి తప్పుకోగా, వంశపారంపర్య ధర్మకర్తగా తుటారం చక్రవర్తి ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన అవనిగడ్డ డిఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ తుటారం చక్రవర్తి, ధనలక్ష్మి దంపతులను సత్కరించి అభినందించారు. గ్రామసర్పంచ్ మండలి ఉదయ భాస్కర్, మండలి రాజేష్, మండలి వెంకట్రామ్, గరికపాటి శివ, దాసరి సత్యనారాయణ, మెండు లక్ష్మణరావు, ఆలయ ధర్మకర్తల పాల్గొన్నారు. భారీ అన్నసమారాధన నిర్వహించారు.

రైతులకు కల్టివేటర్లు, పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

కోడూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : అధిక మోతాదులో రసాయన ఎరువులు వాడటం వల్ల నేల జీవం కోల్పోతుందని, భూసారాన్ని కాపాడుకోవాలని జిల్లా నోడల్ అధికారిణి డి.సుధారాణి అన్నారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని రామకృష్ణాపురం గ్రామ సచివాలయం వద్ద నిర్వహించారు. సబ్సిడీపైరైతులకు కల్టివేటర్లు, పచ్చిరొట్ట విత్తనాలు, పిల్లిపెసర విత్తనాలు పంపిణీ చేశారు. వరిలో కాండం తొలుచు పురుగు, ఆకుముడత పురుగు, పొడ తెగులు మొదలగు యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. అవనిగడ్డ సబ్ డివిజన్ సహా వ్యవసాయ సంచాలకులు జయప్రద, పద్మావతి, వీఏఏ నాగలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

పృథ్విరాజ్ చౌహాన్‌కు అగ్నికుల క్షత్రియుల నివాళి

అవనిగడ్డ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారుల భవనంలో అగ్నికుల క్షత్రియ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో పృథ్విరాజ్ చౌహాన్ 859వ జయంతి నిర్వహించారు. చౌహాన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. లంకే యుగంధర్, కోలా వెంకటేశ్వరరావు, కోలా బాలాజీ, సైకం శ్రీనివాసరావు, మేడా నెలబాలుడు, కొక్కిలిగడ్డ నాంచారయ్య, మచ్చా వెంకటేశ్వరరావు, మైలా నాగేశ్వరరావు, ఒడుగు నాంచారయ్య పాల్గొన్నారు.